సంపుటి : 9
సంచిక : 298
మంగళవారం
21 జూలై 2026
పేజీలు : 12
వెల : 2/-

# విశ్వంవాయిస్

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

10 YEARS CELEBRATING

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE


E-PAPER

విశ్వంవాయిస్
వార్తా ప్రపంచం ఇప్పుడు మీ చేతుల్లో!
తాజా వార్తలు మరియు విశ్లేషణలు
ఈ-పేపర్ కోసం వెంటనే స్కాన్ చేయండి!
వెంటనే స్కాన్ చేయండి!
ఇప్పుడే చదవండి!

Contact For Ads:
7579339999

## ఉత్తరాంధ్ర మణిహారంగా

# భోగాపురం ఎయిర్‌పోర్ట్



▸ ఎయిర్ పోర్టుతో పాటు జీఎమ్మార్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, ఏవియేషన్ హబ్-యూనివర్శిటీ, ఎడ్యుసిటీలను ప్రారంభించనున్న ప్రధాని నరేంద్ర మోదీ

▸ ప్రధాని పర్యటన ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు సమీక్ష

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :**
ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కలను సాకారం చేస్తూ భోగాపురంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి సిద్ధమవుతోంది. ఆగస్టు 1వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ విమానాశ్రయాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు మణిహారంగా నిలుస్తుందని, దీని ప్రారంభోత్సవాన్ని ఒక చారిత్రాత్మక ఘట్టంగా, అత్యంత వైభవంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా ఉత్తరాంధ్ర సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఘన స్వాగతం పలకాలని సీఎం సూచించారు. థింసా, సవర, కొమ్ము కోయ వంటి గిరిజన సంప్రదాయ నృత్య రూపాలతో ఆయనకు స్వాగతం పలకాలని తెలిపారు. ఈ పర్యటనలో ప్రధాని మోదీ విమానాశ్రయ పాసింజర్ టెర్మినల్ భవనాన్ని ప్రారంభించడంతో పాటు, జీఎంఆర్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఏవియేషన్ హబ్-యూనివర్సిటీ, జీఎంఆర్-మాన్సాస్ ఎడ్యుసిటీలకు కూడా శ్రీకారం చుట్టనున్నారని అధికారులు వివరించారు. ఈ విమానాశ్రయం కేవలం ప్రయాణానికే కాకుండా, ఒక కీలకమైన లాజిస్టిక్స్ కేంద్రంగా మారి ప్రపంచవ్యాప్త కనెక్టివిటీని అందిస్తుందని, తద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఒక "గేమ్ ఛేంజర్" అవుతుందని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు కోసం భూములు మిగతా .. 2లో..

## రాష్ట్రంలో 81 మంది

# లిటిగెంట్ పిటిషనర్లను గుర్తించాం

### సీఎం చంద్రబాబు

**విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్‌లో సోమవారం వివిధ శాఖల పని తీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ప్రజా ప్రయోజనం లేకుండా పదేపదే ఫిర్యాదులు చేసే వారిని గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని, ఎల్ నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులను ఎదుర్కోవడానికి సిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. కొంతమంది ఉద్దేశ పూర్వకంగా ప్రభుత్వాన్ని, అధికారులను బద్నాం చేసేందుకే పిటిషన్లు వేస్తున్నారని సీఎం అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 81 మంది మిగతా .. 2లో..

## తెలంగాణలో కొత్త మెట్రో రైలు ప్రాజెక్టులకు

# అనుమతి ఇవ్వలేదు

### కేంద్రం స్పష్టం



**తెలంగాణా, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణలో కొత్తగా ఎటువంటి మెట్రో రైలు ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేయలేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. సోమవారం రాజ్యసభలో కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ఈ విషయాన్ని వెల్లడించారు. బీజేపీ ఎంపీ ఆర్. కృష్ణయ్య అడిగిన ప్రశ్నకు ఆయన రాతపూర్వక సమాధానం ఇచ్చారు. దేశవ్యాప్తంగా మిగతా .. 2లో..

# వాణిజ్య నౌకపై దాడి

### నలుగురు భారతీయులు మృతి



**దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉక్రెయిన్‌లోని ఒడెస్సా పోర్టు నుంచి వెళ్తున్న వాణిజ్య నౌకపై దాడి జరిగింది. ఈ ఘటనలో నలుగురు భారతీయులు ప్రాణాలు కోల్పోగా.. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ అధికారిక ప్రకటన విడుదల చేసింది. గినియా-బిస్సావు జెండా కలిగిన ఎంవీ గోల్డెన్ లియో నౌకపై జులై 19న (ఆదివారం) దాడి జరిగినట్లు వెల్లడించింది. దాడి సమయంలో నౌకలో 17 మంది ఉన్నారు. అందులో ఐదుగురు భారతీయులు. ఉక్రెయిన్‌లోని మిగతా .. 2లో..

## పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో

# త్రిపుర డీజీపీ ఆత్మహత్య



**విశ్వం వాయిస్ న్యూస్ :** త్రిపుర డీజీపీ అనురాగ్ ధన్‌ఖడ్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. అగర్తలా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని ఆఫీస్ బాత్రూంలో అపస్మాకర స్థితిలో ఉన్న ఆయన్ను గుర్తించిన సిబ్బంది వెంటనే ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మరణించినట్లు సమాచారం. ఆయన ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. అయితే దీనికి సంబంధించి ఇంతవరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఈ ఘటన గురించి తెలియగానే ముఖ్యమంత్రి మాణిక్ సాహా డీజీపీ కార్యాలయానికి వెళ్లారు. అనురాగ్ ధన్‌ఖడ్ 1994 బ్యాచ్‌కు చెందిన మిగతా .. 2లో..

## విశ్వం వ్యంగ్యం

నవ్విస్తూ... ఆలోచింపజేస్తుంది!




## టీడీపీ పెద్దల జేబులు నింపేందుకే

# రామాయపట్నం పోర్టు

భారీ నష్టానికి పోర్టును ప్రైవేటుకు కట్టబెట్టే కుట్ర జరుగుతోందని ఆరోపణ
రూ.4929 కోట్ల ప్రాజెక్టును రూ.1500 కోట్లకే అమ్ముతున్నారని విమర్శ
వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్




**తాడేపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** రామాయపట్నం పోర్టు విషయంలో ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్ర భవిష్యత్తుకు అత్యంత కీలకమైన రామాయపట్నం పోర్టును టీడీపీ పెద్దల జేబులు నింపేందుకు ఓ భారీ స్కామ్‌గా మార్చారని, రాష్ట్ర ఖజానాకు వేల కోట్ల రూపాయల నష్టం కలిగించేందుకు సిద్ధమయ్యారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక పోస్ట్ చేస్తూ ప్రభుత్వంపై ఘాటు విమర్శలు గుప్పించారు.

**మా హయాంలో పురోగతి... ఇప్పుడు ప్రైవేటుపరం**

నవ్యాంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధికి పోర్టులే కీలకమని భావించిన తమ ప్రభుత్వం, రామాయపట్నం, మిగతా .. 2లో..

# తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 31 కంపార్ట్‌మెంట్లు పూర్తి
శ్రీవారి సర్వదర్శనానికి సుమారు 18 గంటల సమయం



**తిరుమల, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న రద్దీ సోమవారం కూడా తీవ్రస్థాయిలో ఉంది. దీంతో మిగతా .. 2లో..

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం

ప్రభుత్వ పాఠశాలలను చూసి అసూయపడేలా చేస్తాం - మంగళగిరి నియోజకవర్గాన్ని నెం.1గా తీర్చిదిద్దుతాం
మంగళగిరిలో తల్లికి వందనం లబ్ధిదారులతో మంత్రి లోకేష్ ముఖాముఖి



**మంగళగిరి, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యమని, ప్రభుత్వ పాఠశాలలను చూసి అసూయపడేలా చేస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరి నియోజకవర్గంలోని తల్లికి వందనం పథకం లబ్ధిదారులైన విద్యార్థుల తల్లులతో మంగళగిరి బైపాస్ కొండపనేని టౌన్ షిప్ పార్క్ లో మంత్రి లోకేష్ ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లికి వందనం పథకం అందుతున్న తీరు, తల్లికి వందనం కింద ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయం ఏ విధంగా ఉపయోగపడుతోందనే విషయాలపై మంత్రి ఆరా తీశారు. విద్యార్థుల తల్లుల నుంచి పలు సలహాలు, సూచనలు స్వీకరించారు.

**ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం**

ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా ప్రజాప్రభుత్వం పనిచేస్తోంది. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపునకు కృషిచేస్తున్నాం. గతంలో ప్రైవేటు పాఠశాలలను చూసి అసూయపడేవాళ్లం. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలను చూసి ప్రైవేటు పాఠశాలలు అసూయపడేలా చేస్తాం. నిడమర్రు పాఠశాలలో ప్రవేశాల కోసం విపరీతమైన పోటీ ఉంది. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో లీప్ పాఠశాలలను తీర్చిదిద్దుతాం. ఈ రోజు నేను ఈ స్థాయికి వచ్చానంటే కారణం విద్య. సమాజంలో మార్పునకు, రాష్ట్ర అభివృద్ధికి విద్యే ప్రధానం. ప్రజాప్రభుత్వంలో 16వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశాం. ఈ ఏడాది మరో 3వేల పోస్టులు భర్తీ చేస్తాం. పదివేలకు పైగా పాఠశాలల్లో వన్ క్లాస్-వన్ టీచర్ విధానం తీసుకువచ్చాం. ఈ ఏడాది ప్రైవేటు పాఠశాలల నుంచి 1,06,000 మంది మిగతా .. 2లో..

## ఏడాదిగా ఆమెతో రిలేషన్ షిప్...

# మలుపు తిరిగిన ట్రైనీ ఐపీఎస్ వ్యవహారం

హైదరాబాదులోని జాతీయ పోలీసు అకాడమీలో లైంగిక వేధింపుల కలకలం
ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేసిన మహిళా ట్రైనీ ఐపీఎస్
శానిటైజర్ తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఉదయ్ కృష్ణారెడ్డి - లేఖతో ఆసక్తికర అంశాలు తెరపైకి!



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి లైంగిక వేధింపుల ఆరోపణల వ్యవహారంలో కీలక మలుపు చోటుచేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉదయ్ కృష్ణారెడ్డి సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం, ఆ తర్వాత ఆయన రాశారని చెబుతున్న ఒక లేఖ వెలుగులోకి రావడం తీవ్ర కలకలం రేపుతోంది. తమ మధ్య ఉన్నది ఏకపక్ష వేధింపులు కావని, అది పరస్పర అంగీకారంతో కూడిన సంబంధమని... తామిద్దరం ఏడాదిగా రిలేషన్ షిప్‌లో ఉన్నామని ఆయన ఆ నోట్‌లో పేర్కొనడంతో కేసు కొత్త మలుపు తిరిగింది. వివరాల్లోకి వెళితే, హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఉదయ్ కృష్ణారెడ్డి సోమవారం ఉదయం ఎర్రగడ్డ మోతీ నగర్‌లోని బంధువుల నివాసంలో అపస్మారక స్థితిలో పడి ఉన్నారు. కుటుంబసభ్యులు వెంటనే ఆయన్ను ఎస్ఆర్ నగర్‌లోని జయంతి ఆసుపత్రికి తరలించారు. ఆయన శానిటైజర్ సేవించి ఆత్మహత్యకు యత్నించారని వార్తలు వచ్చాయి. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం. అంతకుముందు, ఉదయ్ కృష్ణారెడ్డిపై కర్ణాటకకు చెందిన మిగతా .. 2లో..



# ఇంట్లో మాయమై.. పొలంలో ప్రత్యక్షమైన చిన్నారి

**నంద్యాల, విశ్వం వాయిస్ న్యూస్ :** నంద్యాలలో ఇంట్లో మాయమై పొలంలో ప్రత్యక్షమైన చిన్నారిని పోలీసులు తల్లి చెంతకు చేర్చారు. వైఎస్ఆర్ నగర్‌లో ఉండే నాలుగేళ్ల చిన్నారి ప్రణవి ఆదివారం ఆడుకుంటూ తప్పిపోయింది. ఊరంతా వెతికినా చిన్నారి జాడ తెలియకపోవడంతో తల్లిదండ్రులు రాత్రి 9 గంటల ప్రాంతంలో నంద్యాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి మిగతా .. 2లో..



## మద్యం రవాణా కుంభకోణం..

# వాసుదేవరెడ్డి రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** వైకాపా హయాంలో జరిగిన మద్యం రవాణా కుంభకోణం కేసులో పలు విషయాలు వెల్లడయ్యాయి. ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డికి సంబంధించి విజయవాడలోని ఏసీబీ ప్రత్యేక కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో సిట్ కీలక అంశాలను ప్రస్తావించింది. మద్యం రవాణా టెండర్లలో రూ.192 కోట్ల అడ్డగోలు దోపిడీ చేశారని మిగతా .. 2లో..

## అన్ని వర్గాలనూ

# కాంగ్రెస్ మోసం చేసింది : కేటీఆర్



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాంగ్రెస్ నేతల మాటలు కోటలు దాటుతున్నాయని.. పనులు మాత్రం గడప కూడా దాటడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని.. చేశారా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని అన్నివర్గాలనూ కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. తెలంగాణ భవన్‌లో బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. ప్రాణం ఉన్నంత వరకు మిగతా .. 2లో..

## విద్యార్థులపై లాఠీ ఛార్జ్‌ను

# ఖండించిన రాహుల్ గాంధీ



**దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** నిరసన ర్యాలీ చేపట్టిన విద్యార్థులు, కాక్రోచ్ జనతాపార్టీ నేతలపై పోలీసులు లాఠీ ఛార్జ్ చేయడాన్ని లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ తప్పుబట్టారు. 'యువత వ్యతిరేకి' అంటూ ప్రధాని మోదీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. పరీక్షల్లో చోటు చేసుకున్న అవకతవకలను ఎత్తి చూపితే.. పోలీసు బలాన్ని ఉపయోగించి మిగతా .. 2లో..

## బ్రిటన్ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన

# యాండీ బర్న్‌హామ్



**లండన్, విశ్వం వాయిస్ న్యూస్ :** బ్రిటన్‌లో అధికార లేబర్ పార్టీ నూతన నేతగా ఎన్నికైన యాండీ బర్న్‌హామ్ నూతన ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. 10 డౌనింగ్ స్ట్రీట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తొలిసారిగా అధికారిక ప్రసంగం చేశారు. బ్రిటన్ ప్రధాన మంత్రుల సంప్రదాయానికి భిన్నంగా యాండీ బర్న్‌హామ్.. తన నూతన ప్రధాన కార్యాలయం నుంచి ప్రసంగించారు. గత ప్రధానులు ఉపయోగించే సంప్రదాయ మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# ఉత్తరాంధ్ర మణిహారంగా భోగాపురం ఎయిర్పోర్ట్

త్యాగం చేసిన రైతులు, యజమానులను గౌరవించేలా వారికి ఒకసారి ఉచిత విమాన ప్రయాణ అవకాశం కల్పించాలని సీఎం అధికారులను ఆదేశించడం విశేషం. ప్రారంభోత్సవం సందర్భంగా భారీ బహిరంగ సభను నిర్వహించాలని, సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ మళ్లింపు, ప్రత్యేక పార్కింగ్ స్లాట్లు, పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని నిర్దేశించారు. హాజరయ్యే వారి కోసం అల్పాహారం, భోజనం, తాగునీటి సదుపాయాలు కల్పించాలని స్పష్టం చేశారు. ఈ చారిత్రాత్మక ఘట్టంపై జూలై 21 నుంచి 31 వరకు పది రోజుల పాటు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సీఎం సూచించారు. ఉత్తరాంధ్రలోని ప్రతి ఇంటికీ ఈ వేడుక స్ఫూర్తి చేరేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అంతర్జాతీయ వేదికలపై ప్రధాని మోదీ స్వయంగా ప్రమోట్ చేస్తున్న అరకు కాఫీ బ్రాండింగ్‌కు కూడా ఈ కార్యక్రమాన్ని వేదికగా మలచాలని చంద్రబాబు సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఉత్తరాంధ్రకు చెందిన ప్రజాప్రతినిధులంతా భాగస్వాములు కావాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో హోం మంత్రి అనిత, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, సివిల్ ఏవియేషన్ అధికారులు, జీఎంఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

**గిరిజన సమస్యలపై త్వరలో చర్చలు.. జీవో 3పై సీఎం చంద్రబాబు కీలక సమీక్ష**

గిరిజన హక్కులకు తమ ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యం ఇస్తుందని, వారి సమస్యలపై చర్చించేందుకు త్వరలోనే గిరిజన సంఘాలతో సమావేశం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో గిరిజన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై ఆయన ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. గిరిజనులకు సంబంధించిన పలు కీలక అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే షెడ్యూల్డ్ ప్రాంతాల్లో గిరిజనులకు 100 శాతం రిజర్వేషన్లు కల్పించే జీవో నెంబర్ 3ని సుప్రీంకోర్టు రద్దు చేసిందని విమర్శించారు. "2000 సంవత్సరంలో మేం తెచ్చిన ఈ జీవోను కాపాడటంలో గత ప్రభుత్వం విఫలమైంది. ఇప్పుడు దీని ప్రయోజనాలను గిరిజనులకు తిరిగి అందించేందుకు ఉన్న అన్ని ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నాం. సుప్రీంకోర్టు తీర్పునకు లోబడి ఎలా న్యాయం చేయాలనే దానిపై కసరత్తు చేస్తున్నాం" అని ఆయన వివరించారు. ఈ ప్రక్రియలో గిరిజన సంఘాలను భాగస్వాములను చేయాలని, వారి సూచనలు కూడా తీసుకోవాలని సీఎం అధికారులకు సూచించారు. సమీక్షలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాను జోన్ 1లోకి, పోలవరం జిల్లాను జోన్ 2లోకి మార్చాలని ఆదేశాలు జారీ చేశారు. బాక్సైట్ విషయంలో గిరిజనులు ఆందోళన చెందవద్దని, వారి హక్కులకు వ్యతిరేకంగా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోదని హామీ ఇచ్చారు. 1/70 చట్టం అమలుపై కూడా ఎటువంటి అనుమానాలు అవసరం లేదని సీఎం స్పష్టం చేశారు. ఈ సమీక్షలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి, సీఎస్ సాయి ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**రాష్ట్రంలో 81 మంది**

# లిటిగెంట్ పిటిషనర్లను గుర్తించాం

లిటిగెంట్ (సమస్యాత్మక) పిటిషనర్లను గుర్తించామని, వీరు ఒక్కొక్కరు సగటున 246 పిటిషన్లు వేస్తున్నారని తెలిపారు. వీరి వివరాలను కలెక్టర్లకు పంపి, వారు పెట్టే అర్జీల్లో ప్రజా ప్రయోజనం ఉంటేనే పరిశీలించాలని స్పష్టం చేశారు. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో 49 శాతం లోటు వర్షపాతం నమోదైందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రభావం నుంచి బయటపడటానికి ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలని సూచించారు. ఆరుతడి పంటలు (డ్రై క్రాప్స్) వేసేలా రైతులను ప్రోత్సహించాలని, వారిలో అవగాహన కల్పించాలని చెప్పారు. జలధార పనులను వీబీజీ రామ్‌జీ పనులతో అనుసంధానం చేసి పెద్ద ఎత్తున చేపట్టాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఆర్థికేతర అంశాలకు తక్షణ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎప్పటికప్పుడు ప్రజాభిప్రాయం తెలుసుకుంటూ, సమస్యలు రాకముందే అంచనా వేసి చర్యలు తీసుకోవాలని పరిపాలన విధానాల్లో మార్పులు సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణలో కొత్త మెట్రో రైలు ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వలేదు

26 నగరాల్లో 1,159 కిలోమీటర్ల మేర మెట్రో నెట్‌వర్క్ ఉందని మంత్రి తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-1ను రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో అమలు చేసిందని, ఈ ప్రాజెక్టుకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కింద కేంద్రం రూ.1,204 కోట్లు విడుదల చేసిందని పేర్కొన్నారు. ఇదే క్రమంలో పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఎటువంటి మెట్రో ప్రాజెక్టులు అమలులో లేవని, అందువల్ల కేంద్రం నుంచి ఆర్థిక సాయం అందించలేదని కూడా స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో మెట్రో ఫేజ్-2 విస్తరణ కోసం తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. శంషాబాద్ విమానాశ్రయం, ఐటీ హబ్స్, పాతబస్తీ మరియు శివారు ప్రాంతాలను కలుపుతూ పలు కారిడార్లలో విస్తరణ చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు సంబంధించిన వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదికలను (డీపీఆర్) కూడా ఇప్పటికే కేంద్రానికి సమర్పించింది. ప్రాజెక్టు వ్యయాన్ని చెరిసగం పంచుకోవడానికి లేదా అవసరమైతే పూర్తి వ్యయాన్ని భరించడానికైనా సిద్ధంగా ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే ప్రకటించింది. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు మెట్రో విస్తరణ అత్యవసరమని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే కేంద్ర మంత్రులతో పలుమార్లు చర్చలు జరిపారు. అయితే, కేంద్ర ప్రభుత్వం తాజాగా చేసిన ప్రకటనతో కొత్త ప్రాజెక్టులకు సంబంధించిన తుది అనుమతులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని స్పష్టమవుతోంది.

# వాణిజ్య నౌకపై దాడి

భారత రాయబార కార్యాలయం పరిస్థితిని నిశితంగా గమనిస్తోందని, బాధితులకు అన్ని విధాలా సహకరించేందుకు ప్రయత్నిస్తోందని విదేశాంగశాఖ తెలిపింది. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపింది. మృతదేహాలను త్వరితగతిన స్వదేశానికి రప్పించే ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొంది. వాణిజ్య నౌకలపై దాడిని భారత ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడం, పౌర సిబ్బందిని ప్రమాదంలోకి నెట్టడం నౌకాయాన, వాణిజ్య స్వేచ్ఛకు ఆటంకం కలిగించడం సరికాదని చెప్పింది. రష్యానే ఈ దాడికి పాల్పడినట్లు సమాచారం.

**పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో**

# త్రిపుర డీజీపీ ఆత్మహత్య

త్రిపుర క్యాడర్ ఐపీఎస్. డీజీపీ మృతిపై ఆసుపత్రి సీనియర్ వైద్యుడు మాట్లాడుతూ మధ్యాహ్నం 12 గంటల సమయంలో అపస్మారక స్థితిలో ఉన్న అనురాగ్ ధన్‌ఖడ్‌ను తీసుకొచ్చారని అన్నారు. వెంటనే డ్యూటీలో ఉన్న వైద్యులు పరిశీలించగా.. అప్పటికే పల్స్ పడిపోయిందని చెప్పారు. దాదాపు 48 నిమిషాల పాటు సీపీఆర్ చేసినా ఫలితం లేకపోయిందన్నారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాతే ఎలా మృతిచెందారన్నదానిపై స్పష్టత వస్తుందని చెప్పారు. ఉరివేసుకున్న ఆనవాళ్లేమైనా కనిపించాయా? అని విలేకరులు ప్రశ్నించగా.. నివేదిక వచ్చిన తర్వాతే అన్ని విషయాలు తెలుస్తాయని అన్నారు. మరోవైపు డీజీపీ మృతితో సీనియర్ పోలీసు అధికారులంతా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు చేరుకున్నారు. సంఘటన స్థలిలో ఆధారాలను సేకరించి, మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

# తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని మొత్తం 31 కంపార్ట్‌మెంట్లు భక్తులతో పూర్తిగా నిండిపోయాయి. ప్రస్తుతం టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి సుమారు 18 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు తెలిపారు. నిన్న ఆదివారం (జులై 19) ఒక్కరోజే 90,956 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. స్వామివారికి 33,046 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 4.05 కోట్లుగా నమోదైంది. రద్దీకి అనుగుణంగా టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది. ఆదివారం నాడు టీటీడీ మొత్తం 4.44 లక్షల లడ్డూలను భక్తులకు విక్రయించింది. అదేవిధంగా, 2.94 లక్షల మంది భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేసింది. యాత్రికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వైద్య కేంద్రాల ద్వారా 3,708 మందికి వైద్య సేవలు అందించినట్లు టీటీడీ వెల్లడించింది. భక్తుల రద్దీ కొనసాగుతున్నందున, యాత్రికులు ఈ విషయాన్ని గమనించి తమ ప్రయాణాన్ని ప్రణాళిక చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

**టీడీపీ పెద్దల జేబులు నింపేందుకే**

# రామాయపట్నం పోర్టు

మచిలీపట్నం, మూలపేట పోర్టుల నిర్మాణంలో గణనీయమైన పురోగతి సాధించిందని జగన్ గుర్తుచేశారు. ఈ మూడు పోర్టులకు సంబంధించి భూసేకరణ, అన్ని రకాల చట్టబద్ధమైన అనుమతులు, ఆర్థిక వనరుల సమీకరణ వంటి అత్యంత క్లిష్టమైన పనులన్నీ తమ హయాంలోనే పూర్తయ్యాయని ఆయన వివరించారు. ప్రాజెక్టుల పూర్తి కోసం ఈపీసీ కాంట్రాక్టులను కూడా ఖరారు చేసి, 2024 జూన్ నాటికి నిర్మాణ పనుల్లో చెప్పుకోదగ్గ పురోగతిని సాధించామని తెలిపారు. ఇంత కష్టపడి ఒక రూపు తీసుకొచ్చిన పోర్టును ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం అప్పనంగా ప్రైవేటుపరం చేసేందుకు కుట్ర పన్నుతోందని ఆయన ఆరోపించారు.

**పోర్టుతో ముడిపడిన భారీ ప్రాజెక్టులు**

రామాయపట్నం పోర్టు వల్ల రాష్ట్రానికి అపారమైన ఆర్థిక ప్రయోజనాలు చేకూరనున్నాయని జగన్ తన పోస్టులో ప్రస్తావించారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) సుమారు రూ.1 లక్ష కోట్లకు పైగా పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ, పెట్రోకెమికల్ కాంప్లెక్స్ పూర్తిగా రామాయపట్నం పోర్టుపైనే ఆధారపడి ఉందని తెలిపారు. ముడి చమురు దిగుమతికి ఈ పోర్టు కీలకం కానుందన్నారు. అలాగే, ఇండోసోల్ సోలార్ సంస్థ ఏర్పాటు చేయనున్న గిగా స్కేల్ తయారీ ప్లాంటుకు కూడా ఈ పోర్టే ఆధారం అని తెలిపారు. ముడిసరుకుల దిగుమతికి, తయారైన సోలార్ మాడ్యూళ్ల ఎగుమతికి ఈ డీప్ వాటర్ పోర్టు అత్యంత అవసరమని పేర్కొన్నారు. వీటితో పాటు, వైఎస్సార్ కడప జిల్లాలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ నిర్మిస్తున్న ఉక్కు కర్మాగారానికి అవసరమైన ముడి ఇనుము, కోకింగ్ కోల్ వంటివి దిగుమతి చేసుకోవడానికి రామాయపట్నం పోర్టులో ఆ సంస్థ రెండు బెర్తులను అభివృద్ధి చేస్తోందని గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టులన్నీ వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించడమే కాకుండా, రాష్ట్రానికి పన్నుల రూపంలో భారీ ఆదాయాన్ని సమకూరుస్తాయని జగన్ వివరించారు.

**రూ.3,500 కోట్ల నష్టానికి అమ్మకం**

ఇన్ని ఆర్థిక ప్రయోజనాలున్న రామాయపట్నం పోర్టును టీడీపీ ప్రభుత్వం ఓ భారీ స్కామ్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తోందని జగన్ తీవ్రంగా ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.4,929 కోట్లు ఖర్చు చేసి నిర్మిస్తున్న ఈ పోర్టును, కేవలం రూ.1,500 కోట్ల ముందస్తు చెల్లింపులకే ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తోందని ఆయన విమర్శించారు. దీనివల్ల రాష్ట్ర ఖజానాకు తీరని నష్టం వాటిల్లుతుందని, మిగిలిన రూ.3,500 కోట్లకు పైగా అప్పుల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే మోయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ పెద్దలకు నగదు ప్రవాహాలు సృష్టించడమే ఈ కుట్ర వెనుక ఉన్న అసలు లక్ష్యమని ఆయన ధ్వజమెత్తారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం

విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు తరలివచ్చారని మంత్రి అన్నారు.

**ప్రభుత్వ పాఠశాలల పనితీరుపై ఆరా**

ప్రభుత్వ పాఠశాలల పనితీరు, బోధన గురించి మహిళలను మంత్రి ప్రశ్నించారు. తల్లికి వందనం పథకం అందరికీ అందుతుందా అని ఆరా తీశారు. అందరికీ తల్లికి వందనం పథకం కింద ఆర్థిక సాయం అందిందని మహిళలు వివరించారు. ఒకటో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు కూడా అందరితో పాటు లబ్ధి చేకూర్చేలా తల్లికి వందనం పథకం జులైలో అమలుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నెల 22 నుంచి 24వ తేదీలోగా ఆర్థిక సాయం నిధులు తల్లుల ఖాతాల్లో జమఅవుతాయని వివరించారు. యువగళం పాదయాత్ర సమయంలో విద్యలో కర్నూలు వెనుకబడి ఉండటాన్ని గమనించానని, ఎంత మంది పిల్లలు ఉన్నా అందరికీ తల్లికి వందనం పథకం అందించాలని అప్పుడే సంకల్పించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా మహిళలు మగ పిల్లలకు కూడా బ్యాడ్ టచ్ గురించి తరగతి గదిలో బోధించాలని, విద్యాసంవత్సరం పూర్తైన తర్వాత పిల్లలకు స్పోకెన్ ఇంగ్లీష్ క్లాస్ లు నిర్వహించాలని కోరారు. ఇందుకు చర్యలు తీసుకుంటామని, స్పోకెన్ ఇంగ్లీష్ క్లాస్ లకు లైబ్రరీలను వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. తల్లికి వందనం పథకం కింద అందే ఆర్థికసాయాన్ని పిల్లల భవిష్యత్ అవసరాల కోసం ఆదా చేస్తున్నట్లు మహిళలు వివరించారు.

**మార్పు మన ఇంటి నుంచే మొదలవ్వాలి**

విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు. ప్రముఖ ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు గారితో నైతిక విలువలపై పుస్తకాలు రూపొందించి విద్యార్థులకు అందజేశాం. మార్పు మన ఇంటి నుంచే మొదలవ్వాలి. మహిళలను అందరూ గౌరవించాలి. టెక్నాలజీ వల్ల మంచీ, చెడూ రెండూ ఉంటాయి. మనం ఏది ఎంచుకున్నామనేది ముఖ్యం. ప్రతి కుటుంబం ఏఐ వినియోగించి నేర్చుకోవాలనేది సీఎం చంద్రబాబు గారి ఆలోచన.

**మంగళగిరి నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం**

మంగళగిరిలో 53వేల ఓట్ల మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరాను. ప్రజలు 91వేల భారీ మెజార్టీతో నన్ను గెలిపించారు. మంగళగిరి నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం. మంగళగిరికి పరిశ్రమలు తీసుకువచ్చి స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. ఇప్పటికే మొదటి విడతలో 3వేల ఇళ్ల పట్టాలు అందజేశాం. రెండో విడతలో మరో 3 వేల పట్టాలు అందిస్తున్నాం. నియోజకవర్గంలో పదివేల ఇళ్లు నిర్మిస్తాం అని లోకేష్ పేర్కొన్నారు.

**ఏడాదిగా ఆమెతో రిలేషన్ షిప్...**

# మలుపు తిరిగిన ట్రైనీ ఐపీఎస్ వ్యవహారం

30 ఏళ్ల వివాహిత, సహ ట్రైనీ ఐపీఎస్ అధికారిణి అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జూన్ 23 నుంచి జూలై 10 మధ్య కాలంలో ఉదయ్ కృష్ణారెడ్డి తనను లైంగికంగా వేధించారని, అసభ్యకర వాట్సాప్ సందేశాలు పంపారని ఆరోపించారు. జూలై 9న తనపై భౌతికంగా దాడి చేసి, జుట్టు పట్టుకుని లాగి, గొంతు నులిమి, కత్తితో బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ ప్రైవేట్ వీడియోను తన భర్తకు పంపి బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని కూడా ఆమె ఆరోపించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఉదయ్ కృష్ణారెడ్డిపై లైంగిక వేధింపులు, దాడి, క్రిమినల్ బెదిరింపులతో పాటు ఐటీ చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ ఆరోపణలపై జాతీయ పోలీస్ అకాడమీ అంతర్గత విచారణ జరిపి, సీసీటీవీ ఫుటేజీని పరిశీలించిన అనంతరం ఉదయ్‌ను అకాడమీ నుంచి తాత్కాలికంగా పంపించివేసినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం ఉదయ్ కృష్ణారెడ్డి రాశారని చెబుతున్న లేఖ వెలుగులోకి వచ్చింది. తనపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, తమ మధ్య ఏడాదిగా రిలేషన్ షిప్ ఉందని ఆయన ఆ నోట్‌లో పేర్కొన్నారు. ఆమెకు వివాహం అయిన తర్వాత కూడా సంబంధం కొనసాగిందని, ఆమె తన గదికి వచ్చిన వీడియో ఆధారాలు తన మొబైల్ ఫోన్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ విషయం గురించి తాను ఆమె భర్తకు కూడా తెలియజేశానని వెల్లడించారు. ఆమే తన గదికి వచ్చి తలుపు తెరవాలని బెదిరించిందని ఉదయ్ కృష్ణారెడ్డి వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాకు చెందిన ఉదయ్ కృష్ణారెడ్డి, చిన్న వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయి నాయనమ్మ సంరక్షణలో పెరిగారు. 2013లో కానిస్టేబుల్‌గా ఉద్యోగంలో చేరి, ఐదో ప్రయత్నంలో సివిల్స్‌లో 350వ ర్యాంకు సాధించి ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. ఆయన స్ఫూర్తిదాయక ప్రయాణం అందరి ప్రశంసలు పొందింది. మహిళా అధికారిణి ఫిర్యాదు, ఉదయ్ కృష్ణారెడ్డి లేఖలోని అంశాలపై పోలీసులు రెండు కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశారు.

# ఇంట్లో మాయమై.. పొలంలో ప్రత్యక్షమైన చిన్నారి

దిగిన పోలీసులు గ్రామంలోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. ఊరి బయటకు ప్రణవి నడుచుకుంటూ వెళ్తున్న దృశ్యాలు లభ్యమయ్యాయి. అయితే అక్కడి నుంచి ఎటు వెళ్లిందనేది అంతు చిక్కలేదు. పోలీసులు డాగ్‌స్క్వాడ్‌ను రంగంలోకి దించారు. రాత్రంతా గాలిస్తూ వెళ్లగా.. ఊరికి 2 కిలోమీటర్ల దూరంలోని పొలంలో ప్రణవి కనిపించింది. చిన్నారిని సురక్షితంగా తీసుకువచ్చి తల్లికి అప్పగించారు.

**మద్యం రవాణా కుంభకోణం..**

# వాసుదేవరెడ్డి రిమాండ్ రిపోర్ట్‌లో కీలక విషయాలు

పేర్కొంది. పక్కా ప్రణాళికతోనే టెండర్ల విధానంలో మార్పులు చేశారని సిట్ నిర్ధరించింది. ప్రభుత్వ అనుమతి లేకుండా ఈ ప్రక్రియ మొత్తం కొనసాగినట్లు రిమాండ్ రిపోర్టులో పేర్కొంది. సిగ్మా, ప్రసాద్ ట్రాన్స్‌పోర్ట్ సంస్థలకు లబ్ధి చేకూర్చేలా నిబంధనల్లో మార్పు చేశారని.. పోటీ ఉన్నట్లు చూపించేందుకు రంగంలోకి డమ్మీ, బినామీ కంపెనీలను దింపారని తెలిపింది. కిలోమీటర్‌కు రూ.19.68గా ఉన్న రవాణా ఛార్జీ ఏకంగా రూ.35కు పెంచినట్లు సిట్ వెల్లడించింది. టెండర్లు లేకుండా సిగ్మా సంస్థ గడువును నాలుగు సార్లు వాసుదేవరెడ్డి పొడిగించినట్లు.. అప్పటి ఉపముఖ్యమంత్రి అభ్యంతరాలను ఆయన పట్టించుకోలేదని పేర్కొంది.

**నిందితులకు రెండు వారాల రిమాండ్**

మద్యం రవాణా టెండర్ల కేసులో నిందితులకు విజయవాడలోని ఏసీబీ కోర్టు రెండు వారాల రిమాండ్ విధించింది. వాసుదేవరెడ్డి, రాజ్‌కెసిరెడ్డి, కారుమూరి సునీల్‌ను జైలుకు తరలించాలని ఆదేశించింది. హైదరాబాద్‌లో ఉన్న నిందితులను పీటీ వారెంట్‌తో సీఐడీ సిట్ అధికారులు విజయవాడకు తరలించి కోర్టులో హాజరుపరిచారు.

**అన్ని వర్గాలనూ**

# కాంగ్రెస్ మోసం చేసింది : కేటీఆర్

బీఆర్ఎస్‌లోనే ఉంటానని చెప్పిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాటతప్పారన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పోచారంతోపాటు కాంగ్రెస్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. "కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యుత్ కోతలు ఎక్కువయ్యాయి.. మోటార్లు కాలిపోతున్నాయి. రైతులకు యూరియా అందించలేకపోతున్నారు. కేసీఆర్ హయాంలో రైతులకు అన్నీ ఇళ్ల వద్దకే వచ్చేవి. రూ.2లక్షల రుణమాఫీ చేశామని కాంగ్రెస్ నేతలు చెప్పారు. 30-40 శాతమైనా పూర్తిచేశారా? ఒక్క ఊరిలో అయినా వందశాతం రుణమాఫీ చేసినట్లు నిరూపించాలని సీఎం రేవంత్‌కు అసెంబ్లీలోనే సవాల్ విసిరా. కేసీఆర్ హయాంలో 11 సార్లు రైతుబంధు వేశారు. కాళేశ్వరంపై మాట్లాడినవన్నీ అబద్ధాలే అని ప్రజలకు తెలిసిపోతుందనే రేవంత్ నీళ్లు వదలడం లేదు. మేడిగడ్డ బ్యారేజ్‌లో కుంగిన రెండు పిల్లర్లకు మరమ్మతులు ఎందుకు చేయలేదు? ఎల్‌నినో వస్తుందని ఆరు నెలల ముందే శాస్త్రవేత్తలు చెబితే.. ప్రభుత్వం ఇప్పుడు సమీక్షలు చేస్తోంది. సరైన ప్రణాళిక లేకుండా సీఎం పనిచేస్తున్నారు" అని కేటీఆర్ విమర్శించారు.

**విద్యార్థులపై లాఠీ ఛార్జ్‌ను**

# ఖండించిన రాహుల్ గాంధీ

అణిచివేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. పేపర్ లీకేజీలకు సంబంధించి విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై వరుస ఆరోపణలు వస్తున్నా రక్షణ కవచంలా వ్యవహరిస్తోందని ఆక్షేపించారు. ఈ ప్రభుత్వహయాములో మొత్తం 152 పరీక్ష పేపర్లు లీకయ్యాయని, దీని వల్ల 7.5 కోట్ల మంది విద్యార్థులు ప్రభావితమయ్యారని ఆయన ఆరోపించారు.

**దీక్షను కొనసాగిస్తా: వాంగ్‌చుక్**

మరోవైపు, సీజేపీ యూత్ లీడర్లు.. పార్లమెంట్‌లో ఆవరణలో ఎంపీలను కలిసి మాట్లాడేంత వరకు దీక్షను కొనసాగిస్తానని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ స్పష్టం చేశారు. లేదంటే వారు తనను కలిసేందుకు పోలీసులు అనుమతి ఇవ్వాలన్నారు. అంతకుముందే పేపర్ లీకేజీకి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను జవాబుదారీని చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు సీజేపీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టిన వారికి సంఘీభావం తెలుపుతూ.. ఆయన రాసిన లేఖను ఆయన సతీమణి గీతాంజలి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు.

**బ్రిటన్ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన**

# యాండీ బర్న్‌హామ్

పోడియం లేకుండానే ఆయన మాట్లాడారు. "గత 40 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా దేశంలో కీలక మార్పులు తీసుకొద్దాం. ఆర్థికంగా, రాజకీయంగా దేశంలో సరికొత్త ఒరవడి సృష్టిద్దాం. నూతన ప్రభుత్వం అందర్నీ కలుపుకొని పోతుంది. ప్రజలు మెరుగైన జీవితాన్ని గడిపేందుకు సాయం చేస్తుంది. అందరికీ ఇళ్లు నిర్మిస్తాం. ఆరుబయట నిద్రించే పరిస్థితి ఇక ఉండదు. సమస్యలు పరిష్కరించడం కంటే.. అవి రాకుండా ముందుగానే అడ్డుకునే వ్యవస్థను అభివృద్ధి చేస్తాం" అని పేర్కొన్నారు.

# ఎడిటర్ వాయిస్

## ఏపీలో కూటమి పార్టీలు.. స్థానిక సమరం..!

స్థానిక ఎన్నికలకు రంగం రెడీ అయిన నేపథ్యంలో కూటమి పార్టీల్లో పోటీ వ్యవహారం రాజకీయంగా చర్చకు దారి తీస్తోంది. బీజేపీ, టీడీపీ, జనసేన కలిసి అధికారం పంచుకున్నా.. గత ఎన్నికల సమయంలో సర్దుబాటు ధోరణితో ముందుకు సాగినా.. ఇప్పుడు వచ్చే స్థానిక ఎన్నికల్లో మాత్రం ఈ సర్దుబాటు వ్యవహారమే రాజకీయంగా పార్టీల్లో చర్చకు వస్తోంది. తమకు ఇన్ని సీట్లు కావాల్సిందేనని ఏ పార్టీకి ఆ పార్టీ భీష్మించే పరిస్థితి వచ్చింది. అంతేకాదు.. ఎవరికి వారు తమ స్థానిక నాయకులను మచ్చిక చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి.

జనసేన నేత, మంత్రి నాదెండ్ల మనోహర్ చేసిన వ్యాఖ్యలు.. రాజకీయంగా చర్చనీయాంశం అయిన విషయం తెలిసిందే. దీనికి కొనసాగింపుగా బీజేపీలోనూ ఇదే ధోరణి కొనసాగుతోంది. విశాఖ ఉత్తరం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు కీలక వ్యాఖ్యలు చేశారు. "మనం కీలక రోల్ పోషించాలి. విశాఖ సహా ఉత్తరాంధ్రలో బీజేపీ ఎదిగేందుకు అవకాశం ఎక్కువగా ఉంది. రాజీ ధోరణి వద్దు" అంటూ.. పార్టీ నాయకులకు ఆయన తేల్చి చెప్పారు. అంటే.. స్థానిక ఎన్నికల్లో కావాల్సినన్ని సీట్లు తీసుకోవాల్సిందేనన్న ధోరణిని ఆయన వినిపించారు.

ఇక, జనసేనలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. క్షేత్రస్థాయిలో నాయకుల సంఖ్య బలం పెంచుకునేందుకు.. వారి సేవలను గుర్తించేందుకు స్థానిక ఎన్నికలు కీలకమని భావిస్తున్న నాయకత్వం.. ఈ ఎన్నికల్లో ఎక్కువ స్థానాలు దక్కించుకునేందుకు ప్రయత్నం చేస్తోంది. ఇదే విషయాన్ని మనోహర్‌చెప్పుకొచ్చారు. మరోవైపు.. టీడీపీ నేతల నుంచి కూడా ఇదే తరహా డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఇలా.. మూడు పార్టీల్లోనూ స్థానిక సమరంపై ఎవరికి వ్యూహాలు వారికి ఉన్నాయి. దీంతో స్థానికంలో సర్దుబాటు వ్యవహారం చాలా సంక్లిష్టంగా మారే అవకాశం ఉందని అంటున్నారు.

మరోవైపు.. పార్టీ అధిష్టానాలు మాత్రం కలిసి ముందుకు సాగాలని నిర్ణయించుకున్నట్టుగా సీఎం చంద్రబాబు చెబుతున్నారు. టీడీపీని ఆయన కంట్రోల్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. కానీ, బీజేపీ, జనసేనల్లో మాత్రం ఇలాంటి పరస్థితి కొంత మేరకు తగ్గిందనే చెప్పాలి. ఈ రెండు పార్టీల్లోనూ ఆశావహుల సంఖ్యతోపాటు.. పార్టీల విస్తరణ అంశం కూడా కీలకంగా మారడంతో స్థానిక ఎన్నికలను కొలమానంగా తీసుకుంటున్న క్షేత్రస్థాయి నాయకులు పోటీకి సై అంటున్నారు. దీంతో స్థానిక ఎన్నికల్లో మూడు పార్టీల మధ్య మరింత సమన్వయం తీసుకురావల్సిన అవసరం ఉంది.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## ఇద్దరి ప్రాణాలు తీసిన ఫొటోల సరదా

### మేహాద్రి రిజర్వాయర్ గొయ్యిలో మునిగి విద్యార్థుల మృతి



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** విశాఖలోని చింతగట్ల సమీప మేహాద్రి రిజర్వాయరు వద్ద గొయ్యిలో ఉన్న నీటివద్దకు ఫొటోషూట్ కోసం దిగిన ఇద్దరు విద్యార్థులు మృత్యువాతపడ్డారు. పెందుర్తి సీఐ సతీష్‌కుమార్ కథనం.. ఎన్ఏడీ కొత్తరోడ్డులోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న గంటా దీపక్(17), గన్నవరపు రామచంద్రరావు(17) మరో నలుగురితో కలసి ఫొటోలు తీసుకునేందుకు మేహాద్రి రిజర్వాయరు శివారు ప్రాంతానికి వెళ్లారు. గొయ్యిలా ఉన్న ప్రాంతం వద్ద ఫొటోలు తీసుకుంటుండగా అదుపు తప్పి దీపక్, రామచంద్రరావు అందులో పడిపోయారు. వారిని రక్షించేందుకు మిగిలిన విద్యార్థులు ప్రయత్నించి విఫలమయ్యారు. అది గమనించిన గేదెల కాపరి స్థానిక తెదేపా నాయకుడు కనకరాజుకు తెలిపాడు. వెంటనే ఆయన నీటిలో దిగి గాలించినా ఫలితం లేకపోయింది. సీఐ సతీష్‌కుమార్ తన సిబ్బందితో వెళ్లి గాలించి, మృతదేహాలను ఒడ్డుకు చేర్చారు.

### యువకుడి హత్య కేసులో

## తల్లిదండ్రులు, సోదరుడు, వృద్ధురాలు అరెస్ట్

**తెనాలి టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** యువకుడి హత్య కేసులో అతడి తల్లిదండ్రులు, సోదరుడు, ఓ వృద్ధురాలిని గుంటూరు జిల్లా తెనాలి పోలీసులు అరెస్ట్ చేశారు. తెనాలి వన్‌టౌన్ పీఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఎస్పీ బి.జనార్దనరావు వివరాలను వెల్లడించారు. తెనాలి పట్టణంలోని నాజరుపేటకు చెందిన కోటేశ్వరరావు (25) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తూ మద్యం, ఇతర దురలవాట్లకు బానిసగా మారాడు. అతడి తీరుతో భార్య విడిచిపెట్టి వెళ్లిపోయింది. రోజూ మద్యం తాగి తల్లిదండ్రుల వద్దకు వచ్చి కొల్లిపరలో వారికి ఉన్న స్థలం అమ్మి నగదు ఇవ్వాలని బెదిరిస్తూ వారిని వేధించేవాడు. ఈ క్రమంలో ఈనెల 15న రాత్రి వేధింపులు తీవ్రం కావడంతో తండ్రి భాస్కరరావు, తల్లి విజయమ్మ, సోదరుడు మరియదాసు కలిసి కోటేశ్వరరావుపై రోకలిబండ, చపాతీకర్రతో దాడి చేసి కత్తితో గొంతుకోశారు. ఆపై చున్నీ, ఛార్జింగ్ వైరు బిగించి హత్య చేశారు. మృతదేహాన్ని పట్టాలో చుట్టి కృష్ణా నదిలో పడేయడానికి ఆటోలో బయల్దేరుతుండగా.. స్థానిక మహిళ, పరిసర ప్రాంతాల వారు అడ్డుకుని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకున్నారు. ముగ్గురు నిందితులతో పాటు వారికి సహకరించిన వృద్ధురాలు నాగేశ్వరమ్మను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. వారిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఈనెల 31 వరకు రిమాండ్ విధించారు. దీంతో నిందితులను గుంటూరు జైలుకు తరలించారు.



## లైంగిక వేధింపుల ఆరోపణలు.. జిమ్ ట్రైనర్‌పై కేసు

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** జిమ్ ట్రైనర్ లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదైంది. ఈ ఘటన విజయవాడలో చోటుచేసుకుంది. ప్రైవేట్ టీచర్‌గా పనిచేస్తున్న యువతికి జిమ్ ట్రైనర్ అబ్దుల్ ఖాదర్ ఇన్‌స్టాలో పరిచయమయ్యాడు. సన్నబడేందుకు సలహాలు ఇస్తూ పరిచయం పెంచుకున్నాడని.. ప్రైవేట్ హోటల్‌కు తీసుకెళ్లి మత్తుమందు ఇచ్చారని ఆమె ఆరోపించారు. యువతి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలోని బండ్లగూడ జాగీర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడిని సుధాకర్‌గా గుర్తించారు. ఇంటి బెడ్‌రూమ్‌లో విగతజీవిగా కనిపించడంతో కుటుంబ సభ్యులు రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మద్యం బాటిల్‌లో విషం కలిపి తాగినట్లు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### పోలీస్‌స్టేషన్‌లో భార్యపై

## కత్తితో దాడి చేసిన భర్త



**ఏన్కూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** పోలీస్‌స్టేషన్‌లోనే భార్యపై భర్త కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఖమ్మం జిల్లా ఏన్కూరులో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఏన్కూరు మండలం ఎర్రబోడు తండాకు చెందిన రాంబాబు, రజిని దంపతులు. కొంతకాలంగా మనస్పర్థలతో వేర్వేరుగా ఉంటున్నారు. రజిని కారేపల్లి మండలంలో నివాసముంటోంది. సోమవారం ఏన్కూరులో ఓ బ్యాంకు వద్దకు డ్వాక్రా రుణం చెల్లించేందుకు ఆమె వచ్చింది. రాంబాబు అక్కడికి వచ్చి రజినితో వాదనకు దిగాడు. ఆమె డయల్ 100కు ఫోన్ చేయగా స్థానిక పోలీసులు బ్యాంకు వద్దకు చేరుకుని వారిద్దర్నీ పీఎస్‌కు తీసుకెళ్లారు. రజిని స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తుండగా.. రాంబాబు తన వెంట తెచ్చుకున్న కత్తితో ఒక్కసారిగా ఆమెపై దాడికి పాల్పడ్డాడు. అప్రమత్తమైన పోలీసులు అతడ్ని అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన మహిళను ఏన్కూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం 108 అంబులెన్స్‌లో ఖమ్మం తరలించారు.

## సముద్రంలో స్నానాలకు దిగి ఇద్దరి మృతి.. మరొకరు గల్లంతు



**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సముద్రంలో స్నానానికి దిగిన ఇద్దరు యువకులు మృతిచెందగా.. ఒకరు గల్లంతయ్యారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు తీరంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అంబాజీపేట మండలం మాచవరానికి చెందిన 9 మంది ఆదివారం మధ్యాహ్నం ఓడలరేవు తీరానికి వెళ్లారు. ఐదుగురు స్నానాలకు దిగారు. వారిలో సూదా అరవింద్ వెంకటసాయి(23), మంచాల షణ్ముఖ్ శ్రీరాం(17), మంచాల నాగసాయి సత్యభాస్కర్(22) గల్లంతయ్యారు. కొద్దిసేపటి తర్వాత అరవింద్, షణ్ముఖ్ మృతదేహాలు లభ్యమయ్యాయి. సత్యభాస్కర్ ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.



విశ్వం వాయిస్
అవినీతిపై - అక్షర సమరం...
VISWAMVOICE TELUGU DAILY

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు






మంగళవారం, 21 జూలై, 2026



www.viswamvoice.com

సత్యం • సమగ్రం • సమాజ బాధ్యత
www.viswamvoice.com


# 20 ఏళ్ల సమస్యకు కూటమి ప్రభుత్వంలో పరిష్కారం

## ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ - రూ.13.50 లక్షల డ్రైనేజీ పనులకు శ్రీకారం

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** దాదాపు రెండు దశాబ్దాలుగా స్థానిక ప్రజలను వేధిస్తున్న సమస్యకు కూటమి ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న ఆయన, ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటున్నామన్నారు. స్థానిక 39వ డివిజన్ లింగంపేట రెండో వీధిలో రూ.13.50 లక్షలతో చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 39వ డివిజన్లో ఇప్పటికే రూ.2.60 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తి చేశామని, మరో రూ.52 లక్షల విలువైన పనులు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ పనులు ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని స్థానిక నాయకుల ప్రతిపాదనల మేరకు చేపడుతున్నామని చెప్పారు. లింగంపేటలోని దేవాలయం వద్ద కల్వర్టు ఎత్తు పెంపు, రోడ్డు ఎత్తు పెంపు వంటి పనులు కూడా చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే డివిజన్ ఇన్చార్జి ప్రదీప్ ప్రతిపాదించిన మరో మూడు ప్రాంతాల్లో కూడా అభివృద్ధి పనులు చేపడుతున్నామని, దాదాపు 20 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు ఇప్పుడు పరిష్కారం లభిస్తోందని పేర్కొన్నారు. రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని రూ.1.80




కోట్ల అభివృద్ధి పనులకు ఇప్పటికే పరిపాలనా అనుమతులు లభించాయని, త్వరలోనే వాటిని కూడా ప్రారంభిస్తామని వెల్లడించారు. 39వ డివిజన్ను నగరానికి ఆదర్శవంతమైన (రోల్ మోడల్) డివిజన్ గా తీర్చిదిద్దే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుందని, ప్రజల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

## పీజీఆర్ఎస్‌లో 39 ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ నరసింహ కిషోర్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసల్ సిస్టం - పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని తూర్పుగోదావరి జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వివిధ రకాల ఫిర్యాదులను ఎస్పీ స్వయంగా స్వీకరించారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులతో వెంటనే ఫోన్‌లో మాట్లాడి చట్టపరిధిలో త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం జరిగేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పెండింగ్‌లో ఉన్న అంశాలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. ప్రజల సమస్యలను సానుభూతితో వినడమే కాకుండా, వాటికి చట్టబద్ధమైన పరిష్కారం చూపేందుకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి మొత్తం 39 ఫిర్యాదులు అందాయి. వీటిలో భూ, ఆస్తి సంబంధిత సివిల్ వివాదాలు, కుటుంబ కలహాలు, మోసపూరిత ఘటనలు, కొట్లాటలు, ఇతర నేరాలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి. ప్రతి ఫిర్యాదును సంబంధిత పోలీసు అధికారులకు పంపించి, నిర్ణీత గడువులో విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించాలని ఎస్పీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు న్యాయం అందించడం పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం నిర్భయంగా పోలీసు శాఖను ఆశ్రయించాలని ఎస్పీ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీజీఆర్ఎస్ కార్యక్రమం ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడంలో సమర్థవంతమైన వేదికగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు.

# రత్నకిషోర్ సేవలు చిరస్మరణీయం : మేడా శ్రీనివాస్

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పాత్రికేయుడు కుడెల్లి రత్నకిషోర్ ఆకస్మిక మరణం పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో స్వగృహంలో సోమవారం సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఆర్సీ అధినేత, జేడీఆర్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మేడా శ్రీనివాస్ రత్నకిషోర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేడా శ్రీనివాస్ మాట్లాడుతూ రత్నకిషోర్ స్వల్ప కాలంలోనే మీడియా రంగంలో తన ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని అన్నారు. సహచర పాత్రికేయులతో ఆప్యాయంగా మెలుగుతూ అందరి అభిమానాన్ని చూరగొన్న వ్యక్తిగా ఆయన గుర్తుండిపోతారని పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా జర్నలిస్ట్ డెమోక్రాటిక్ రైట్స్ ఫోరం జిల్లా కార్యదర్శిగా పనిచేసిన రత్నకిషోర్ పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారని కొనియాడారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ కోసం ఎప్పుడూ ముందుండి పోరాడిన ఆయన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా నిలిచిపోయిన రాజమండ్రి ప్రెస్ క్లబ్ ఎన్నికలు నిర్వహించాలంటూ ఉద్యమానికి శ్రీకారం చుట్టి, పాత్రికేయులను ఏకం చేసే ప్రయత్నంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. పాత్రికేయ సంక్షేమం కోసం ఆయన చూపిన నిబద్ధత, సేవా భావం అందరికీ ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. రత్నకిషోర్ మరణం మీడియా రంగానికి



తీరని లోటని, ఆయన ఆశయాలను కొనసాగించడం ద్వారా నిజమైన నివాళి అర్పించిన వారమవుతామని మేడా శ్రీనివాస్ అన్నారు. సంస్మరణ సభలో తూర్పుగోదావరి జిల్లా జేడీఆర్ఎఫ్ నాయకులు మారంపూడి సోమరాజు, పిచ్చుక మహేష్ తదితరులు పాల్గొని రత్నకిషోర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జిల్లాల పునర్విభజనలో

# ఉపాధ్యాయులకు అన్యాయం వద్దు

- ఉపాధ్యాయుల సీనియారిటీకి ఫీడర్ కేడర్ సర్వీసే ప్రామాణికం కావాలి
- జిల్లాల పునర్విభజనలో అసలు నియామక తేదీ ఆధారంగానే సీనియారిటీ కల్పించాలి
- ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన ఏపీటీఎఫ్ (1938)




**భీమవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాల పునర్విభజన నేపథ్యంలో ఉపాధ్యాయుల సీనియారిటీ నిర్ణయంలో ఫీడర్ కేడర్ సర్వీసును తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్-1938) పశ్చిమగోదావరి జిల్లా శాఖ ప్రభుత్వాన్ని కోరింది. ఉపాధ్యాయుల అసలు నియామక తేదీని సీనియారిటీకి ప్రామాణికంగా గుర్తించి, ఎలాంటి అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు రమణ, ప్రధాన కార్యదర్శి హరికృష్ణ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా రూపొందిస్తున్న జిల్లా సీనియారిటీ జాబితాల్లో ఫీడర్ కేడర్ సర్వీసును విస్మరిస్తే, సుదీర్ఘకాలంగా ప్రభుత్వ సేవలో ఉన్న పలువురు ఉపాధ్యాయులు తమ సీనియారిటీని కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమోషన్ పొంది వివిధ కారణాలతో రివర్షన్ తీసుకున్న ఉపాధ్యాయులు, ఎయిడెడ్ విద్యాసంస్థల నుంచి మండల పరిషత్, జిల్లా పరిషత్, ఇతర ప్రభుత్వ పాఠశాలల్లో విలీనమైన ఉపాధ్యాయులు, అలాగే అంతర జిల్లా బదిలీల ద్వారా వచ్చిన ఉపాధ్యాయులకు వారి అసలు నియామక తేదీ ఆధారంగానే సీనియారిటీ కల్పించాలని కోరారు. జిల్లాల పునర్విభజన ప్రక్రియ వల్ల ఏ ఒక్క ఉపాధ్యాయుడూ నష్టపోకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, ఫీడర్ కేడర్ సర్వీసును సీనియారిటీ నిర్ణయంలో పరిగణనలోకి తీసుకుని ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ఏపీటీఎఫ్ (1938) పశ్చిమగోదావరి జిల్లా శాఖ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేసింది.

# కంబాల కానుకలతో మహిళలు ఖుషి ఖుషీ

**1300మంది మహిళలకు ఉచిత పట్టు చీరలు పంపిణీ -కంబాలకు ఘనంగా పౌర సన్మానం**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండలం దోసకాయపల్లిలో ఆదివారం రాత్రి నిర్వహించిన కంబాల కానుకలు-వనితలకు వేడుకలు కార్యక్రమంలో మహిళలు ఖుషి ఖుషిగా కనిపించారు. విశ్వ హిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు హిందూధర్మ పరిరక్షణ ధ్యేయంగా రాజానగరం, జగ్గంపేట, రంపచోడవరం నియోజకవర్గాల్లో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు అనునిత్యం పెద్ద ఎత్తున నిర్వహిస్తూ ప్రజల్లో మమేకమవు తున్నారు. ఆదివారం ఈ కార్యక్రమంలో భాగంగా దోసకాయపల్లి విచ్చేసిన కంబాలకు మహిళలు హరతులు పట్టి ఘనంగా స్వాగతం పలికారు. కంబాల గ్రామ దేవతలకు దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించి, తొలి పట్టుచీరలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నియోజకవర్గాల్లో ప్రజలకు ఏ కష్టం వచ్చిన అండగా నేనుంటానని, ఆందోళన చెందుద్దన్నారు. హిందూధర్మ పరిరక్షణ తన ధ్యేయమని, దేశంలో నరేంద్ర మోడీ సంక్షేమ అభివృద్ధితో పాటు దేశ భద్రత, హిందూధర్మ పరిరక్షణకు చేస్తున్న కృషి ఎనలేని కొనియాడారు. మనందరం ఆయనకు వెన్నుదన్నుగా నిలిచి, అన్ని మతాలను గౌరవించు కుంటూ, హిందువులందరం భిన్నత్వంలో ఏకత్వంగా జీవిద్దామన్నారు. మహిళలకు అత్యంత ప్రియమైన బంగారాన్ని "బంగారు వరలక్ష్మి" కానుకగా చాలామందికి అందించామన్నారు. త్వరలో మిగిలిన వారికి అందజేస్తామ న్నారు. మూడు నియోజక వర్గంలో ప్రతి మహిళకు కంబాల పట్టుచీర అందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టా మన్నారు. సుమారు 1300మంది మహిళలకు కంబాల చేతుల మీదుగా పట్టుచీరలు అందించారు. అనంతరం పార్టీలకు కులాలకు అతీతంగా గ్రామస్తులు కంబాలకు పౌర సన్మానం పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, భారీగా మహిళలు పాల్గొన్నారు.



# అనుమతి లేని ఇసుక త్రవ్వకాలపై ఉక్కుపాదం

## 13 డ్రెడ్జింగ్ బోట్లు సీజ్.. 15 బోట్లు వదిలేశారన్న ప్రచారం అవాస్తవం

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కోటిలింగాల డిసిల్టేషన్ రీచ్‌లో అనుమతి లేకుండా ఇసుక త్రవ్వకాలు, రవాణా కార్యకలాపాలు నిర్వహిస్తున్న 13 డ్రెడ్జింగ్ బోట్లను అధికారులు సోమవారం సీజ్ చేశారు. నూతన ఇసుక విధానం-2024తో పాటు పర్యావరణ నిబంధనలను ఉల్లంఘించినందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. రెవెన్యూ, గనులు-భూగర్భ, నీటిపారుదల శాఖల అధికారులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీలో ఈ అక్రమాలు వెలుగుచూశాయి. రెవెన్యూ డివిజనల్ అధికారి సమక్షంలో గనులు-భూగర్భ శాఖ అధికారులు, సాంకేతిక సిబ్బంది, అర్బన్ తహసీల్దార్, రెవెన్యూ అధికారులు, నీటిపారుదల శాఖ అధికారులు కోటిలింగాల డిసిల్టేషన్ ర్యాంపు వద్ద విస్తృత తనిఖీలు చేపట్టారు. సాయిరామ్ శాండ్ అండ్ బోట్స్‌మెన్ సొసైటీ



పరిధిలో మొత్తం 13 డ్రెడ్జింగ్ బోట్లు అనుమతి లేకుండా ఇసుక త్రవ్వకాలు, రవాణాలో పాల్గొన్నట్లు గుర్తించారు. విచారణలో మూడు బోట్లు నండూరి రాజుకు, మరో మూడు ముత్యాల వెంకట రమణకు, మరో మూడు కూచిపూడి బాలస్వామికి చెందినవిగా గుర్తించారు. మిగిలిన నాలుగు బోట్ల యజమానులు తనిఖీ సమయంలో గుర్తించ బడకపోవడంతో వాటిని అన్‌క్లెయిమ్డ్ బోట్లుగా నమోదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా డ్రెడ్జింగ్ బోట్లను వినియోగించినందున మొత్తం 13 బోట్లను స్వాధీనం చేసుకుని తదుపరి చర్యల కోసం నీటిపారుదల శాఖకు అప్పగించారు. సంబంధిత చట్టాల ప్రకారం క్రిమినల్ చర్యలు కూడా చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. సోషల్ మీడియాలో "28 డ్రెడ్జింగ్ బోట్లు పట్టుకుని 13 మాత్రమే సీజ్ చేసి, మిగిలిన 15 బోట్లను వదిలేశారు" అనే ప్రచారం పూర్తిగా అవాస్తవమని అధికారులు స్పష్టం చేశారు. తనిఖీలో గుర్తించిన 13 బోట్లపైనే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. వంతెనలకు ఇరువైపులా 500 మీటర్ల పరిధిలో ఎలాంటి ఇసుక త్రవ్వకాలు చేపట్టినా సంబంధిత వ్యక్తులపై కఠినమైన శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలో రెవెన్యూ, గనులు-భూగర్భ, నీటిపారుదల శాఖల అధికారులు, సాంకేతిక సిబ్బంది, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వీఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

# ముంపు నివారణకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలి : కమిషనర్

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలో ఎక్కడా వర్షపు నీటి నిల్వలు లేకుండా, ముంపు నివారణకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని కమిషనర్ రాహుల్ మీనా ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని మీటింగ్ హాల్ నందు ముంపు నివారణపై ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులతో శనివారం



ఆయన సమీక్ష నిర్వహించారు. వర్షాలు కురిసిన సమయంలో కోరుకొండ రోడ్డు, హైటెక్ బస్టాండ్ సహా పలు ప్రాంతాల్లో నీటి నిల్వలు ఏర్పడటానికి గల కారణాలను ఈ సందర్భంగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ వ్యవస్థలో కనెక్టివిటీ సక్రమంగా ఉందా, ఎక్కడైనా గ్యాప్‌లు ఉన్నాయా, నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏమైనా ఉన్నాయా..? అనే అంశాలపై సమీక్షించారు. డ్రైనేజీ కనెక్టివిటీని మెరుగుపరచడంతో పాటు గుర్తించిన గ్యాప్‌లను వెంటనే సరిచేసి, వర్షాల సమయంలో రహదారులపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఎక్కడైనా ఆక్రమణలు ఉన్నట్లయితే టౌన్ ప్లానింగ్ అధికారుల సమన్వయంతో తక్షణమే తొలగించవలసిందిగా ఆదేశించారు. అలాగే రానున్న పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని గామన్ బ్రిడ్జి నుంచి ధవళేశ్వరం వరకు ఎక్కడా ఇరిగేషన్ తూముల నుంచి మురుగు నీరు గోదావరిలో కలవకుండా.. ధవళేశ్వరం బ్యారేజీ దిగువ భాగానికి కలిసే విధంగా సన్నాహాలు చేస్తున్నట్లు ఈ సందర్భంగా తెలియజేశారు. సమావేశంలో అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, ఈఈ మదర్షా అలీ, ఎంహెచ్ఓ వినూత్న, డీఈలు, ఏఈలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.




# బాధితుల సమస్యలకు సత్వర న్యాయమే మా ప్రాధాన్యత : ఎస్పీ రాహుల్ మీనా



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజల ఫిర్యాదులను స్వీకరించి, వాటికి సత్వర పరిష్కారం చూపే లక్ష్యంతో సోమవారం జిల్లా పోలీసు కార్యాలయం (డీపీఓ)లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) మహేంద్ర మత్తేతో కలిసి బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులతో ఎస్పీ ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను ఓపికగా విన్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 44 ఫిర్యాదులు నమోద య్యాయి. వీటిలో ప్రధానంగా భూ వివాదాలు, కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలు, సివిల్ సంబంధిత సమస్యలు ఉన్నాయి. అందిన ఫిర్యాదులను వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్లకు పంపిస్తూ, క్షేత్రస్థాయిలో నిష్పక్షపాతంగా విచారణ నిర్వహించాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. చట్టపరిధిలో బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. పోలీసు వ్యవస్థపై ప్రజలకు పూర్తి నమ్మకం ఉండేలా ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా, జాప్యం లేకుండా పరిష్కరిస్తామని ఎస్పీ బాధితులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) మహేంద్ర మత్తే, డీపీఓ సిబ్బంది, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి పంటకు సాగునీరు అందించాలి

**అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి**

**క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి సమస్యలు పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్**



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలోని ప్రతి పంటకు సకాలంలో సాగునీరు అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో జిల్లాలో సాగునీటి పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రెవెన్యూ అధికారులు ప్రతిరోజూ రెండు మండలాలను క్షేత్రస్థాయిలో సందర్శించి సాగునీటి పరిస్థితిని పర్యవేక్షించాలని సూచించారు. అలాగే తహసీల్దార్లు, ఇరిగేషన్, వ్యవసాయ శాఖల మండల స్థాయి అధికారులు ప్రతిరోజూ మూడు గ్రామాలను సందర్శించి రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వెంటనే పరిష్కరించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో ఎక్కడా రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా వచ్చే రెండు, మూడు రోజుల్లో పరిస్థితిని పూర్తిగా చక్కదిద్దాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రధాన పంట కాలువల వెంబడి పూడికతీత పనులను వేగవంతం చేయాలని, వంతెనల వద్ద పేరుకుపోయిన బంకమట్టిని తొలగించేలా ఇరిగేషన్, ఆర్ అండ్ బి, నేషనల్ హైవేస్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సమన్వయంతో సత్వర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే పంట కాలువల్లో పూడిక, గుర్రపుడెక్క (వాటర్ హైసింథ్), తూము, కలుపు మొక్కలు తదితర అడ్డంకులను వెంటనే తొలగించి నీటి ప్రవాహం చివరి ఆయకట్టు వరకు నిరంతరాయంగా చేరేలా ఇరిగేషన్ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో జిల్లా స్థాయి అధికారులు, ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**సోనం వాంగ్చుక్ అరెస్టుకు వ్యతిరేకంగా**

# సీపీఎం, ప్రజాసంఘాలు అమలాపురంలో ధర్నా



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రముఖ విద్యావేత్త, పర్యావరణ ఉద్యమకారుడు సోనం వాంగ్చుక్ చేపట్టిన శాంతియుత ఆమరణ దీక్షను పోలీసులు అప్రజాస్వామికంగా భగ్నం చేయడాన్ని నిరసిస్తూ, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇవాళ అమలాపురం గడియార స్తంభం సెంటర్ వద్ద సీపీఎం పార్టీ మరియు వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు నేతృత్వం వహించారు. సీపీఎం శ్రేణులు, విద్యార్థి, యువజన, మహిళా, దళిత సామాజిక, హక్కుల సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, అభ్యుదయవాదులు మరియు మేధావులు గడియార స్తంభం సెంటర్ వద్దకు చేరుకుని కేంద్ర ప్రభుత్వ నిరంకుశ పోకడలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ?సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు జి దుర్గాప్రసాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరాం, ఏపీఆర్ పిఎ రాష్ట్ర కార్యదర్శి ఎం వెంకటేశ్వరరావు, పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు జిల్లెల్ల మనోహర్ అమలుదాసు బాబురావు, పిడిఎం నాయకులు దీపాటి శివప్రసాద్, తదితరులు మాట్లాడుతూ దేశంలో విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించిన, నీటి పరీక్ష పత్రాలు లీకేజీ ప్రధాన సూత్రధారి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పదవిలో కొనసాగే అర్హత కోల్పోయారని మండిపడ్డారు. దేశ భవిష్యత్తు కోసం, పర్యావరణ పరిరక్షణ కోసం, లడఖ్ ప్రజల హక్కుల కోసం శాంతియుతంగా ఆమరణ దీక్షకు కూర్చున్న సోనం వాంగ్చుక్‌ను అక్రమంగా అరెస్ట్ చేయడం, ఆయన దీక్షను భగ్నం చేయడం మోదీ ప్రభుత్వ అప్రజాస్వామిక, నిరంకుశ విధానాలకు నిదర్శనమని ధ్వజమెత్తారు. "ప్రశ్నించే గొంతుకలను నొక్కేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పోలీసు బలగాలను వాడుకుంటోంది. సోనం వాంగ్చుక్ లాంటి అంతర్జాతీయ ఖ్యాతి గడించిన మేధావిపై ఇటువంటి చర్యలకు పాల్పడటం సిగ్గుచేటు. ఆగ్రహం వ్యక్తం చేశారు.

**డిమాండ్లు:** విద్యా రంగ వైఫల్యాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలి. సోనం వాంగ్చుక్‌పై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసి, ఆయన పోరాట డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి. దేశంలో ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన తెలిపే హక్కులను కాలరాయడం ఆపాలి. ఈ నిరసన ప్రదర్శనలో సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం, సిఐటియు జిల్లా అధ్యక్షులు జి. దుర్గాప్రసాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరాం, ఏపీఆర్ పిఎ రాష్ట్ర కార్యదర్శి ఎం. వెంకటేశ్వరరావు, పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు జిల్లెల్ల మనోహర్ అమలుదాసు బాబురావు, పిడిఎం నాయకులు దీపాటి శివప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు ఐ మంగాదేవి, పాము బాలయ్య,చింతా వీరప్రసాద్,కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు బుంగ సత్యనారాయణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కే.శంకర్ బి.వెన్నెల, సీఐటీయూ నాయకులు నాగ వరలక్ష్మి పార్వతి,ఎస్ రాజ్ కుమార్, బొంతు పార్వతి రామకృష్ణ, శసిరెడ్డి బాబ్జి,బి రాంబాబు, సిహెచ్ సత్యనారాయణ,టి. బాలాజీ మురళి తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా నారాయణ స్కూల్**

# క్యాబినెట్ ప్రమాణ స్వీకార ఉత్సవం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం సోమవారం ది20-07-26 తేదీన స్టూడెంట్ క్యాబినెట్ ప్రమాణ స్వీకారోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పి. సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ విద్యార్థులలో నాయకత్వ లక్షణాలను ప్రజాస్వామ్య విలువలను తెలియజేయడానికి ప్రతి ఏటా నారాయణ విద్యాసంస్థలు స్టూడెంట్ క్యాబినెట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని దీనిలో భాగంగా క్యాంపస్ హెడ్ బాయ్ ,హెడ్ గర్ల్, హౌస్ కెప్టెన్లు విద్యార్థులు ఎన్నుకుంటారని తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన రామచంద్రపురం చాకలిపేట మున్సిపల్ హై స్కూల్ హెచ్.ఎం చేగుండి వీర వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ ఈ విధమైన కార్యక్రమాలు విద్యార్థులకు ప్రజాస్వామ్య విలువలను తెలియజేస్తాయని, ఎన్నికైన స్టూడెంట్ క్యాబినెట్ సభ్యులు పాఠశాలలో క్రమశిక్షణ కాపాడడానికి కృషి చేస్తామని వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సభను ఉద్దేశించి నారాయణ అమలాపురం జోన్ ఏ.జీ.ఎం కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు నారాయణ స్కూల్ చదువుతోపాటు సామాజిక బాధ్యతను కూడా నేర్పించే అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని దాన్లో భాగమే ఈ స్టూడెంట్ క్యాబినెట్ అని తెలియజేస్తూ విజయం సాధించిన విద్యార్థిని విద్యార్థులను అభినందించారు. అనంతరం విద్యార్థులచే సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో తేనేటి విందుల కూడా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ కోఆర్డినేటర్ మూర్తి సార్, లైఫ్ స్కిల్స్ ఆర్ ఎస్ టి ప్రవీణ్ , లైఫ్ స్కిల్స్ ట్రైనర్ సూర్య పాఠశాల విద్యార్థులు ,ఉపాధ్యా యులు, ఉపాధ్యాయ్యేతర సిబ్బంది ,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు వినూత్న ముందడుగు

**రామచంద్రపురంలో కనుమరుగవుతున్న వృక్ష జాతుల పునరుద్ధరణ కార్యక్రమం ప్రారంభం**



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం పట్టణంలో పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ఒక గొప్ప సంకల్పానికి శ్రీకారం చుట్టారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత అనే ఉద్దేశంతో, పట్టణంలో ఈ రోజు (20-07-2026) నుండి "నెలకు ఒక్కరోజు - కనీసం ప్రతిమనిషి ఒక వృక్షం" నాటాలి అనే వినూత్న కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ప్రస్తుత కాలంలో ఎన్నో రకాల మహావృక్షాలు వాటి పేర్లు కూడా మనకు తెలియకుండానే కాలగర్భంలో కనుమరుగు అవుతున్నాయి. అలా అంతరించిపోతున్న వృక్ష జాతులను తిరిగి బ్రతికించి, భవిష్యత్ తరాలకు అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. పూర్తిగా దాతల నుంచి లభించే స్వచ్ఛంద సహాయ సహకారాలతో ఈ హరిత యజ్ఞాన్ని నిరంతరాయంగా కొనసాగించనున్నారు. ఈ రోజు జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా, దాతలు మంతెన బాబురావు భార్య భారతి, వారి కుమారుడు అఖిల్ కలిసి మూడు కొబ్బరి మొక్కలను అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు. ఈ విశిష్ట కార్యక్రమాన్ని కొత్తూరు రోడ్డులోని ప్రసిద్ధ శ్రీ దుర్గాదేవి ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధల నడుమ మొక్కలు నాటి ప్రారంభించారు. ఈ పర్యావరణ హిత కార్యక్రమంలో స్థానిక శివాలయం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ చెరుకుపల్లి గణేష్ శర్మ, గరిమెళ్ళ వి.ఎస్.ఎస్. రామకృష్ణ, ఆలయ అర్చకులు ఆదిత్య శర్మతో పాటు పలువురు ప్రముఖులు, భక్తులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పంచాయతీ కాంట్రాక్ట్ ఉద్యోగుల ఆందోళన

**ఉద్యోగ భద్రత కల్పించాలని గ్రామపంచాయతీ కాంట్రాక్టు ఉద్యోగుల డిమాండ్**




**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కాంట్రాక్ట్ ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ తమ సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీలు గ్రేడ్‌లుగా మారిన నేపథ్యంలో తమ సేవలకు ప్రాధాన్యత కల్పించి, అర్హత, అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ జోక్యం చేసుకుని తమ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.తమ జీతాలను రాష్ట్ర ప్రభుత్వ ఖజానా నుంచి నేరుగా చెల్లించే విధానం అమలు చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ వంటి సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. తక్కువ వేతనాలతో అధిక పనిభారం మోయాల్సి వస్తోందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు.వీధి దీపాల నిర్వహణ, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య పనులు తదితర బాధ్యతలను నిరంతరం నిర్వర్తిస్తున్నప్పటికీ తగిన గుర్తింపు, భద్రత లభించడం లేదన్నారు. ఈ ఆందోళనలో జిల్లా అధ్యక్షుడు గంద్రు సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి పెద్దిరెడ్డి వేమలరావు, మోరం నాయుడు, గుత్తుల భైరవస్వామి, దాసరి రాజు, కోలం నాగబాబు తదితరులు పాల్గొని కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# జీవో 396ను తక్షణమే ఉపసంహరించుకోవాలి


**రిజిస్ట్రేషన్ సేవల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దస్తావేజు లేఖర్ల సమ్మె**

**జూలై 31 వరకు ఆందోళన కొనసాగిస్తామని వెల్లడి**



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థిరాస్తులు, ఆస్తి దస్తావేజుల రిజిస్ట్రేషన్ సేవలను ప్రైవేటీకరించే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ముమ్మిడివరం దస్తావేజు లేఖర్లు, సహాయకులు, టైపిస్టులు డిమాండ్ చేశారు. జీవో నెం.396ను వ్యతిరేకిస్తూ సోమవారం ముమ్మిడివరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద సమ్మె ప్రారంభించారు. ఈ నెల 31వ తేదీ వరకు సమ్మె కొనసాగిస్తామని ప్రకటించారు. రిజిస్ట్రేషన్ సేవల ప్రైవేటీకరణను నిలిపివేయడంతో పాటు దస్తావేజు లేఖర్ల లైసెన్సులను పునరుద్ధరించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. తరతరాలుగా సంపాదించిన అనుభవంతో క్రయవిక్రయదారులకు ఎలాంటి వివాదాలు తలెత్తకుండా రిజిస్ట్రేషన్ సంబంధిత సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. బ్రిటిష్ కాలం నుంచి కొనసాగుతున్న దస్తావేజు లేఖర్ల వ్యవస్థను నిర్వీర్యం చేసే చర్యలను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. రిజిస్ట్రేషన్ సేవల ప్రైవేటీకరణకు సంబంధించి ఇటీవల జారీ చేసిన జీవో నెం.396ను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ జీవో అమలుతో ప్రజలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియలో జాప్యం ఏర్పడటంతో పాటు సమయం వృథా కావడం, అదనపు ఖర్చులు భరించాల్సిన పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ముమ్మిడివరం తహశీల్దార్ సుభాష్‌కు అందజేశారు. కార్యక్రమంలో చవటపల్లి వెంకటేశ్వరరావు, తాడాల వీరబాబు, సలాది చిట్టిబాబు, దొమ్మేటి గాంధీ, అయినాపురపు గోపాలకృష్ణ, గాలిదేవర సురేష్, ఎం.వి.ఎస్. కృష్ణారావు, అడబాల దొరబాబు, యల్లాప్రగడ కృష్ణ, పాలగుమ్మి రాంబాబు, వాడ్రేవు భాస్కరరావు, బొంతు నరేష్, వంగా నాగేంద్ర, వస్త్రాల శివశంకర్, కోటిపల్లి తిరుపతిరావు, నార్ని బుజ్జి, బొక్కా రఘుబాబు, కుంచే శ్రీనివాస్, తాడి వాసు, అర్దాని సూరిబాబు, బొక్కా శేఖర్ తదితర దస్తావేజు లేఖర్లు, సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

# 'చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తాం'



**విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలో నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పర్యటనతో రైతులకు మేలు జరగనుంది. కాలువల్లో నీటి ప్రవాహానికి ఉన్న అడ్డంకులు తొలగిపోనున్నాయి. ఇందులో భాగంగా చల్లపల్లి ప్రధాన పంట కాలువలో గుర్రపుడెక్క చెత్త తొలగింపు పనులు చేపట్టామని తెలిపారు. ప్రతి రైతుకు, చివరి ఆయకట్టు భూములకు సైతం సాగునీరు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ఈ పనులకు రైతులంతా సహకరించాలని ఆయన కోరారు.తొలగింపు పనులను సెంట్రల్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్ స్వయంగా పర్యవేక్షించారు. శివారు ప్రాంత భూములకు కూడా సాగునీరు అందేలా చర్యలు చేపట్టడంపై స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రతిభకు పెద్దపీట 166 మంది విద్యార్థులకు ప్రతిభ అవార్డులు




**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లాలో గత విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 166 మంది విద్యార్థులను సోమవారం అమలాపురంలోని శ్రీ సత్యనారాయణ గార్డెన్స్‌లో నిర్వహించిన 'షైనింగ్ స్టార్స్-ప్రతిభ అవార్డులు' కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి.మమ్మీ మాట్లాడుతూ, కృషి, పట్టుదలతో ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని కోనసీమ విద్యార్థులు నిరూపించారని అన్నారు. గత ఏడాది రాష్ట్ర స్థాయిలో జిల్లా వరుసగా రెండో స్థానంలో నిలవడానికి కృషి చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. వచ్చే విద్యా సంవత్సరంలో జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపే లక్ష్యంతో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను కూడా ఉత్తమ ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ విద్యా నాణ్యత పెంపు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ విద్యాశాఖకు మార్గనిర్దేశం చేస్తున్నారని ఆమె తెలిపారు. జిల్లా విద్యాశాఖ, ఉపాధ్యాయులు, అధికారులు, విద్యార్థుల తరఫున కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా విద్యాశాఖ అధికారి పి. నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలోని ప్రతిభావంతులైన విద్యార్థులతో పాటు వారికి మార్గనిర్దేశం చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. జిల్లా వ్యాప్తంగా ఎంపికైన 136 మంది పదో తరగతి షైనింగ్ స్టార్స్, అలాగే 30 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులను సత్కరించినట్లు తెలిపారు. వీరందరికీ మెడల్, ప్రశంసాపత్రం, రూ.20 వేల నగదు ప్రోత్సాహకం అందజేసినట్లు పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో కోనసీమ జిల్లా రాష్ట్రంలో వరుసగా రెండో స్థానంలో నిలవడంతో పాటు, బాలికల ఉత్తీర్ణత శాతంలో రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించిందని తెలిపారు. అలాగే జిల్లాలోని 87 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు శతశాతం ఉత్తీర్ణత నమోదు చేయడం విశేషమన్నారు. కార్యక్రమంలో అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు డాక్టర్ కె.నాగ మానస, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ బి.హనుమంతరావు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి చంద్రశేఖర్ బాబు, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఆస్తి రిజిస్ట్రేషన్లు చేసుకునే వారికి ముఖ్య గమనిక!



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆస్తి రిజిస్ట్రేషన్ల సేవల ప్రైవేటీకరణను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ముమ్మిడివరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖర్లు, సహాయకులు, టైపిస్టులు సోమవారం ధర్నాకు దిగారు. జీవో నంబర్ 396ను నిరసిస్తూ సమ్మె ప్రారంభించారు. ఈ నెల 31 వరకు సమ్మె కొనసాగిస్తామని ప్రకటించారు. రిజిస్ట్రేషన్ల సేవల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# ప్రతిభకు ప్రభుత్వ ప్రోత్సాహం..

## 185 మంది విద్యార్థులకు 'షైనింగ్ స్టార్స్' పురస్కారాలు




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. విద్యార్థి దశలో సాధించిన విజయాలు భవిష్యత్ జీవితానికి బలమైన పునాది అవుతాయని, క్రమశిక్షణ, పట్టుదలతో మరిన్ని శిఖరాలు అధిరోహించాలని సూచించారు. రాజమహేంద్రవరంలోని పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌లో జిల్లా పాఠశాల విద్యాశాఖ, ఇంటర్మీడియట్ విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'షైనింగ్ స్టార్స్-2026' కార్యక్రమంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సోము వీర్రాజు మాట్లాడుతూ భారతదేశం విజ్ఞానానికి నిలయమని పేర్కొన్నారు. విద్యా రంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాయని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధి, నాణ్యమైన విద్య కోసం పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. విద్యా ఫలితాల్లో బాలికలు ముందంజలో నిలుస్తుండటం అభినందనీయమని, బాలురు కూడా అదే స్థాయిలో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. జాయింట్ కలెక్టర్ వై.మేఘా స్వరూప్ మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో యువత పాత్ర అత్యంత కీలకమని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివిన విద్యార్థులు ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా ఫలితాలు సాధించడం ఆనందదాయకమన్నారు. విజయాలకు కారణమైన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఎప్పటికీ మరువకూడదని, ఈ విజయం తొలి అడుగుగా భావించి ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ ఒకే వేదికపై ఇంతమంది ప్రతిభావంతులైన విద్యార్థులను సత్కరించడం సంతోషకరమన్నారు. కృషి, పట్టుదలతో ఏ రంగంలోనైనా ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని, హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తించి ఆదర్శ పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. అసిస్టెంట్ కలెక్టర్ ఆదిత్య శర్మ మాట్లాడుతూ నిరంతర సాధన, అంకితభావం, పట్టుదలతోనే ఈ గౌరవం సాధ్యమైందని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా విద్యాశాఖ అధికారి కే. వాసుదేవరావు మాట్లాడుతూ పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 142 మంది విద్యార్థులను జిల్లా స్థాయి ప్రతిభా పురస్కారాలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరిలో 83 మంది బాలికలు, 59 మంది బాలురు ఉన్నారని చెప్పారు. 22 మండలాల నుంచి విద్యార్థులు ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమన్నారు. నల్లజర్ల, రాజమహేంద్రవరం గ్రామీణ మండలాల నుంచి అత్యధికంగా తొమ్మిది మంది చొప్పున ఎంపికయ్యారని వెల్లడించారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారిణి శారద మాట్లాడుతూ ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 43 మంది విద్యార్థులను షైనింగ్ స్టార్స్ పురస్కారాలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. అనంతరం పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన 142 మంది, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబర్చిన 43 మంది విద్యార్థులకు మెడళ్లు, ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులను అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి, భారతీయ సంస్కృతి, విద్య ప్రాధాన్యాన్ని ప్రతిబింబించే సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యాశాఖ ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనలో ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న విద్యా సంస్కరణలు, మౌలిక వసతుల అభివృద్ధి, విద్యార్థుల విజయాలను ప్రతిబింబించే చిత్రాలు సందర్శకులను ఆకర్షించాయి. అవార్డులు అందుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రభుత్వ ప్రోత్సాహానికి, ఉపాధ్యాయుల కృషికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### సొసైటీల బలోపేతమే

# రైతుల అభివృద్ధికి బాట



**రాజానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రాథమిక సహ కార సంఘాల బలోపేతానికి సొసైటీల ముఖ్య కార్యనిర్వ హణ అధికారులు సమర్థ వంతంగా పనిచేయాలని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సూచించారు. కూటమి ప్రభుత్వంలో సహకార సంఘాల పనితీరు మరింత మెరుగుపడి రైతులకు నాణ్యమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. రాజానగరం నియోజకవర్గంలోని ప్రాథమిక సహకార సంఘాల ముఖ్య కార్యనిర్వహణ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా సహకార అధికారి, రాజమహేంద్రవరం డివిజనల్ సహకార అధికారి పాల్గొన్నారు. సంఘాల పనితీరు, రుణాల వసూళ్లు, రైతులకు అందిస్తున్న సేవలపై సమగ్రంగా సమీక్షించారు. సభ్యులకు మంజూరు చేసిన స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాల వసూళ్లను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. మొండి బకాయిలను తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుల విశ్వాసాన్ని సంపాదించినప్పుడే డిపాజిట్ల సేకరణ, వ్యాపార విస్తరణ విజయవంతమవుతుందని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణలో ఎలాంటి లోపాలు ఉండకూడదని, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఎరువుల సరఫరాలో కొరత లేకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని చెప్పారు. నిల్వల సమస్యలు తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ముగ్గళ్ళ, మునికూడలి, రఘుదేవపురం, సీతానగరం, ఇనుగంటివారిపేట, వెదుళ్లపల్లి సంఘాల పరిధిలోని లంక భూముల్లో సాగు చేస్తున్న రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎరువుల అవసరాలపై ముందుగానే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. నల్లగొండ, ములగాడ ప్రాంత రైతులకు సౌకర్యవంతంగా ఎరువుల పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రాజానగరం, కాపవరం ప్రాంతాల్లో అసంపూర్తిగా ఉన్న గోదాముల నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. సహకార సంఘాల సభ్యులు ఎదుర్కొంటున్న బకాయిల రివ్యూ ఛార్జీలు, వాటా మూలధనం, విక్రయాల కమీషన్ వంటి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సహకార సంఘాలు రైతులకు మరింత చేరువై నమ్మకాన్ని పెంపొందించే విధంగా సేవలు అందించాలని, అదే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి దోహదపడుతుందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు.

# ముద్రగడ-జీఎస్ రావు సంస్మరణ సభకు హాజరైన ప్రముఖులు





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముద్రగడ పద్మనాభం, స్వర్గీయ జీఎస్ రావు సంస్మరణ సభకు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రముఖ నాయకులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీలు, పార్టీ పరిశీలకులు, కాపు జేఏసీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సభలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పాల్గొన్నారు. మాజీ మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, అంబటి రాంబాబు, గుడివాడ అమర్నాథ్, జోగి రమేష్, కురసాల కన్నబాబు, శైలజానాథ్ హాజరయ్యారు. ఏలూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తోట త్రిమూర్తులు, సోము వీర్రాజు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కూడా సభకు విచ్చేశారు. మాజీ ఎమ్మెల్యేలు పుప్పాల వాసుబాబు, తలారి వెంకట్రావు, రౌతు సూర్యప్రకాశరావు, జ్యోతుల చంటిబాబు, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, కరణం ధర్మశ్రీ, అంబటి మురళి హాజరయ్యారు. మాజీ ఎంపీలు ఉండవల్లి అరుణ్‌కుమార్, మార్గాని భరత్‌రామ్, అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి శ్రీనివాస్ సభలో పాల్గొన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జడ్పీ మాజీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, కాపు జేఏసీ నాయకులు దాసరి రాము, ఆకుల రామకృష్ణ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు జెట్టి గురునాథం, తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రాజమహేంద్రవరం నగర కాపు సంఘం అధ్యక్షుడు నందేపు శ్రీనివాస్ హాజరయ్యారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్ని కృష్ణ, పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి దొవులూరి దొరబాబు, భీమవరం ఇన్‌చార్జి చిన్నమిల్లి వెంకట్రాయుడు, తాడేపల్లిగూడెం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వడ్డీ రఘురామ్ కూడా సభకు వచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం మాజీ రీజినల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్, ఏపీ ఐఐసీ మాజీ చైర్మన్ కోళ్లపు శివరామసుబ్రహ్మణ్యం, రాజానగరం, నిడదవోలు నియోజకవర్గ పరిశీలకులు తోట రామకృష్ణ, గిరిజాల బాబు, నాయకులు యాళ్ల సురేష్, నల్లా విష్ణు, ఆరేటి సూర్యప్రకాశ్‌తో పాటు వేలాదిమంది నాయకులు, కార్యకర్తలు సంస్మరణ సభలో పాల్గొని జీఎస్ రావుకు నివాళులర్పించారు.

### స్థానిక ఎన్నికల లక్ష్యంగా

# బీజేపీ సంస్థాగత బలోపేతం

### రాజమహేంద్రవరం నాలుగో మండలానికి కొత్త అధ్యక్షుడిగా బత్తిన రత్నాజీ ఎన్నిక



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ మంది బీజేపీ కార్యకర్తలను ప్రజాప్రతినిధులుగా తీర్చిదిద్దడమే పార్టీ ప్రధాన లక్ష్యమని తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర తెలిపారు. రాజమహేంద్రవరంలో నిర్వహించిన బీజేపీ నాలుగో మండల సంస్థాగత సమావేశంలో బత్తిన రత్నాజీని మండల అధ్యక్షుడిగా పార్టీ క్రియాశీల సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోగా, రత్న ప్రకాష్‌ను మండల ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఉన్ని కృష్ణన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి పిక్కి నాగేంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టిపల్లి శివ నాగరాజు ఎన్నికల పరిశీలకుడిగా, మండల ఇన్‌చార్జి మైలవరపు పద్మనాభ సాయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిక్కి నాగేంద్ర మాట్లాడుతూ దేశ అభివృద్ధి, జాతీయ భద్రత, సమాజ శ్రేయస్సు, భారతీయ సంస్కృతి పరిరక్షణ లక్ష్యాలతో భారతీయ జనతా పార్టీ నిరంతరం పనిచేస్తోందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, మెరుగైన సమాజ నిర్మాణం కోసం పార్టీ కార్యకర్తలు అంకితభావంతో సేవలందిస్తున్నారని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు ప్రజాప్రతినిధులుగా ఎన్నికైతే ప్రజలకు నిస్వార్థ సేవ అందించే అవకాశం పెరుగుతుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక నిధులను సమర్థంగా వినియోగించి గ్రామాలు, పట్టణాలు, నగరాల అభివృద్ధికి మరింత వేగం తీసుకురావడానికి పార్టీ కృషి చేస్తుందని వివరించారు. కొత్తగా ఎన్నికైన మండల అధ్యక్షుడు బత్తిన రత్నాజీ, ప్రధాన కార్యదర్శి రత్న ప్రకాష్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసి కార్యకర్తలను సమన్వయం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు. సమావేశంలో సుబ్రహ్మణ్యం, అడపా వరప్రసాద్, కొల్లా శ్రీను, మహేష్, కామేశ్వరి తదితర నాయకులు పాల్గొన్నారు. పార్టీ విస్తరణ, సంస్థాగత నిర్మాణం, రాబోయే ఎన్నికలకు సంబంధించిన కార్యాచరణపై కూడా చర్చించారు.

# స్పందన లక్ష్యం నీరుగారుతోందని ఆర్పీసీ ఆరోపణ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముఖ్యమంత్రి ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న స్పందన (పీజీఆర్ఎస్) కార్యక్రమం లక్ష్యాలు అధికార యంత్రాంగం నిర్లక్ష్యంతో దెబ్బతింటున్నాయని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ ఆరోపించారు. పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన వారాంత సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ప్రభుత్వ సేవలపై నమ్మకం కల్పించేందుకు ఏర్పాటు చేసిన స్పందన వ్యవస్థ ప్రస్తుతం ప్రజల వ్యతిరేకతను ఎదుర్కొంటోందని అన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించకపోవడంతో బాధితులకు న్యాయం జరగడం లేదని విమర్శించారు. ఫిర్యాదులను నిబంధనల ప్రకారం విచారించకుండా కేవలం ఆన్‌లైన్‌లో పరిష్కరించినట్లు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారని పేర్కొన్నారు. కొన్ని శాఖల్లో ఫిర్యాదుదారులను నిరుత్సాహపరచడం, ఫిర్యాదుల వివరాలు ముందుగానే సంబంధిత వ్యక్తులకు చేరవేయడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆరోపించారు. పీజీఆర్ఎస్‌లో విచారణ పూర్తి కాకముందే "పరిష్కరించబడింది" లేదా "పరిష్కారానికి వీలు కాదు" అనే వ్యాఖ్యలతో కేసులు ముగిస్తున్నారని అన్నారు. పోలీసు, రెవెన్యూ శాఖల్లో స్పందన ఫిర్యాదులపై సరైన విచారణ జరగడం లేదని, బాధితులను బెదిరించి లేదా ఒత్తిడి తెచ్చి ఫిర్యాదులు ఉపసంహరించుకునే పరిస్థితులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. కొన్ని సందర్భాల్లో ఫిర్యాదుదారుల సంతకాలను ఫోర్జరీ చేసి తప్పుడు నివేదికలు పంపుతున్న ఘటనలు కూడా ఉన్నాయని తెలిపారు. అధికార దుర్వినియోగంపై ఫిర్యాదు చేసిన వారినే తిరిగి అదే అధికారుల వద్దకు విచారణ కోసం పంపడం వల్ల బాధితులు మరింత మానసిక వేదనకు గురవుతున్నారని అన్నారు. అవినీతిని అరికట్టి, విధి నిర్వహణలో నిర్లక్ష్యం చూపుతున్న అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోకపోతే ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం దెబ్బతింటుందని హెచ్చరించారు. స్పందన వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు చేపట్టి, ప్రజలకు పారదర్శకమైన సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మేడా శ్రీనివాస్ కోరారు. సమావేశానికి పెండ్యాల కామరాజు అధ్యక్షత వహించగా, సిమ్మా దుర్గారావు, దుడ్డే త్రినాథ్, వర్ధనపు శరత్ కుమార్, దుడ్డే సురేష్, కాకర ప్రసాద్, గుడ్ల సాయిదుర్గాప్రసాద్, బసా సోనియా, మేకల కిరణ్, చల్లా సాంబశివరావు, దోషి నిషాంత్, నాగూరి అన్నపూర్ణ, కందివలస రమణ తదితరులు పాల్గొన్నారు.

# ఆక్వా రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

### ఆక్వా మేతల ధరల పై కేంద్ర మత్యశాఖ మంత్రి రంజన్ సింగ్ తో మంత్రులతో కలసి ఎంపీ హరీష్ చర్చలు

**విశ్వం వాయిస్ న్యూస్ :** ఆక్వా రైతులకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందని అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి అన్నారు. ఆక్వా మేతల ధరలు తగ్గించే చర్యలపై ఢిల్లీలోని మంత్రి కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ఆక్వాకల్చర్ రంగం అభివృద్ధికి అత్యంత కీలకమైన ఆక్వా మేత ధరలను తగ్గించే చర్యలపై చర్చించడానికి, గౌరవనీయ కేంద్ర మత్స్య, పశు సంవర్ధక మరియు పాడిపరిశ్రమల శాఖ మంత్రి శ్రీ రాజీవ్ రంజన్ సింగ్ (లల్లన్ సింగ్) తో కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాసవర్మ , డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, సహచర ఎంపీలు, తదితరులతో కలసి చర్చించినట్లు ఎంపీ హరీష్ బాలయోగి చెప్పారు. ప్రధానంగా ఆక్వా మేతలకు ముడి పదార్థాల పెరుగుతున్న ధరలు మన రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆక్వా రైతులపై గణనీయమైన భారాన్ని మోపాయని రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి వ్యయాలను స్థిరీకరించడానికి మరియు ఈ రంగానికి మరింత స్థిరమైన ధరల విధానాన్ని నిర్ధారించడానికి గల సంభావ్య చర్యలపై ఈ సమావేశంలో చర్చించామన్నారు. ఆక్వా రైతులను ఆదుకోవడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎంపీ హరీష్ తెలిపారు.





### స్వర్గీయ రత్నకిషోర్ కుటుంబానికి

# 'విశ్వం వాయిస్' సంస్థ రూ.20వేలు ఆర్థిక చేయూత

### విశ్వం వాయిస్‌కు రత్నకిషోర్ లోటు ఎనలేనిది





**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** విశ్వం వాయిస్ దినపత్రికకు స్వర్గీయ కుడెల్లి రత్నకిషోర్ చేసిన సేవలు ఎనలేనివని విశ్వం వాయిస్ అధినేత ఖండవిల్లి సునీల్ కుమార్ కొనియాడారు. సోమవారం స్వర్గీయ రత్నకిషోర్ పెద్దకార్యం రాజమహేంద్రవరంలోని తన స్వగృహంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్వం వాయిస్ అధినేత సునీల్ కుమార్‌తో పాటు పలు మండలాల నుండి విశ్వం వాయిస్ పాత్రికేయులు విచ్చేసి, రత్న కిషోర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్, రత్న కిషోర్ చేసిన సేవలను కొనియాడుతూ పత్రికా రంగంలో అందరితో అన్నఅన్న అంటూ ఆప్యాయతగా పలకరించేవాడని, సంస్థ తరపున ఏ కార్యక్రమం చేపట్టిన తాను ముందే ఉండేవాడని, అటువంటి వ్యక్తిని కోల్పోవడం బాధాకరమని, కిషోర్ కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. అనంతరం రత్న కిషోర్ కుటుంబానికి విశ్వం వాయిస్ సంస్థ తరపున 20వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వం వాయిస్ అధినేత ఖండవిల్లి సునీల్ కుమార్, మేనేజింగ్ డైరెక్టర్ చంద్ర, వెంకటేష్, చిట్టిబాబు, తూర్పుగోదావరి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, అల్లూరి జిల్లాల పాత్రికేయులు తదితరులు విచ్చేశారు.

### తూర్పుగోదావరి జిల్లా గణేష్ ఉత్సవ సమితి

# నూతన కార్యవర్గం నియామకం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా గణేశ్ ఉత్సవ సమితి నూతన జిల్లా కార్యవర్గాన్ని నియమించారు. రాజమహేంద్రవరంలోని ఏవీఏ రోడ్డులోని అర్బన్ కేఫ్‌లో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సమావేశానికి ఆంధ్రప్రదేశ్ గణేశ్ ఉత్సవ సమితి ఉపాధ్యక్షుడు వీరమాచినేని రంగప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గణేశ్ ఉత్సవ సమితి ధార్మిక చింతన, సామాజిక సద్భావన, పర్యావరణ పరిరక్షణ అనే మూడు ప్రధాన లక్ష్యాలతో పనిచేస్తోందని తెలిపారు. గణేశ్ మండపాల ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ శాఖల అనుమతులను ఒకే విధానంలో పొందేలా చర్యలు చేపట్టడం, నిర్వాహకులు అధికారులతో సమన్వయం చేసుకునే విధానం, ఉత్సవాల నిర్వహణలో పాటించాల్సిన నిబంధనలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. సమావేశంలో తూర్పుగోదావరి జిల్లా గణేశ్ ఉత్సవ సమితి నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా జెట్టి శివసత్య కుమార్, ఉపాధ్యక్షురాలిగా ఎ. శకుంతల, కార్యదర్శిగా కోట శ్రీనివాసరావు, కోశాధికారిగా పోతుల గణేష్ నియమితులయ్యారు. సహాయ కార్యదర్శులుగా రవి, బులుసు నాగేంద్ర, ఆకుల శ్రీనివాసరావును నియమించారు. జిల్లా కార్యవర్గంలోని ఇతర సభ్యులు కూడా సమావేశంలో పాల్గొని ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు సమిష్టిగా కృషి చేయాలని నిర్ణయించారు

# రత్న కిషోర్ కుటుంబానికి అండగా జర్నలిస్టులు

### రూ.70 వేల ఆర్థిక సాయం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జర్నలిస్టు కూడెల్లి రత్న కిషోర్ అకాల మరణంతో ఆయన కుటుంబానికి అండగా నిలిచేందుకు రాజమండ్రి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు ఉదారంగా స్పందించారు. సేకరించిన మొత్తం రూ.70 వేల ఆర్థిక సహాయాన్ని రత్న కిషోర్ కుటుంబానికి అందజేశారు. రత్న కిషోర్ మరణించిన రోజున రాజమండ్రి ప్రెస్ క్లబ్ తరఫున రూ.10 వేల ఆర్థిక సహాయం అందించగా, సోమవారం నిర్వహించిన సంస్మరణ సభలో మరో రూ.15 వేలు అందజేశారు. దీంతో ప్రెస్ క్లబ్ తరఫున మొత్తం రూ.25 వేల సహాయం అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కూడుపూడి సత్తిబాబు తెలుగుదేశం పార్టీ తరఫున రూ.5 వేలు, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ కన్వీనర్ టీకే విశ్వేశ్వర్ రెడ్డి రూ.5 వేలు, దేశిరెడ్డి బలరామ నాయుడు రూ.1,000, ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ రూ.2,000 అందించారు. అలాగే రాజమహేంద్రవరం జర్నలిస్టు మిత్రులు స్వచ్ఛందంగా విరాళాలు అందించి రత్న కిషోర్ కుమారుడి భవిష్యత్తుకు తమ వంతు చేయూత అందించారు. మోతా బాల విజయసారథి, గంద్రోతు వేణుగోపాలస్వామి, పురుషోత్తమ కుమార్, ఈనాడు రామకృష్ణ, కళాధర్, ఎన్‌టీవీ వాసు, టీవీ9 సత్య, డి. శ్రీనివాసరావు, ప్రైమ్ న్యూస్ రాజా, నక్కపల్లి శామ్యూల్, యార్లగడ్డ నరేష్, బాలు, 6 టీవీ చంటి, పి. సుబ్బరాజు, రాఘవ, ఏఎన్‌ఐ టీవీ సాయి, దేశరాజు తలుపులరావు--వీరబాబు, కందుకూరి విజయ శైలేంద్ర, కిరణ్ కుమార్ రాజు, భమిడిపల్లి వీర రాఘవరావు, వైవీవీ నాగభూషణం, లింకన్, ఎన్.ఎస్., రామ్ నారాయణ, కె.మధు, ఎం.డి. నజీర్, లయన్ జానీ రాయ్, రమేష్ (ఉదయ అక్షరం), పి. వినోద్ (ఆయుధం), సంగీతరావు, మరుకుర్తి చక్రరావు తదితరులు తమకు చేతనైన మేరకు విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా రాజమండ్రి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మోతా విజయసారథి, ప్రధాన కార్యదర్శి గంద్రోతు వేణుగోపాలస్వామి మాట్లాడుతూ, మంచి మిత్రుడిని కోల్పోవడం బాధాకరమని అన్నారు. అయితే ఆ క్లిష్ట సమయంలో రత్న కిషోర్ కుటుంబానికి అండగా నిలవాలనే భావంతో స్పందించి ఉదారంగా సహాయం అందించిన జర్నలిస్టు మిత్రులు, ప్రజాప్రతినిధులు, దాతలందరికీ రాజమండ్రి ప్రెస్ క్లబ్ తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. వారి సహకారం రత్న కిషోర్ కుటుంబానికి ధైర్యాన్ని, భరోసాను ఇచ్చిందని పేర్కొన్నారు.

# జీఎస్ రావుకు వైఎస్సార్ కాంగ్రెస్ నేతల ఘన నివాళి



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా పెద్దేవం గ్రామంలో మాజీ శాసనసభ్యుడు, మాజీ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు స్వర్గీయ జీఎస్ రావుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. స్వస్థలంలోని ఆయన నివాసానికి చేరుకున్న పార్టీ నాయకులు చిత్రపటానికి పుష్పాంజలి అర్పించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. జీఎస్ రావు సతీమణిని, ఆయన కుమారుడు, మాజీ శాసనసభ్యుడు జి.శ్రీనివాస్ నాయుడును కలిసి ఓదార్చారు. ప్రజాసేవలో జీఎస్ రావు అందించిన సేవలు చిరస్మరణీయమని, రాజకీయాల్లో ఆయన నిబద్ధత, విలువలు భావితరాలకు ఆదర్శమని నాయకులు పేర్కొన్నారు. ప్రజలతో మమేకమై పనిచేసిన నాయకుడిగా ఆయనను స్మరించుకున్నారు. శ్రద్ధాంజలి కార్యక్రమంలో రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రులు జోగి రమేష్, అంబటి రాంబాబు, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, శైలజానాథ్, సీనియర్ నాయకుడు లేళ్ల అప్పిరెడ్డి, మాజీ ఎంపీ మార్గాని భరత్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, రాజమండ్రి పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, పార్లమెంటు పరిశీలకుడు తిప్పల గురుమూర్తి రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు తోట రామకృష్ణ, గిరిజాల బాబు, నక్క రాజబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై జీఎస్ రావు చిత్రపటానికి పుష్పాంజలి అర్పించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. జీఎస్ రావు సేవలను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని, ఆయన ఆశయాలను కొనసాగించే దిశగా కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

# ప్రభుత్వం జీవో నెంబర్ 396 వెంటనే రద్దు చేయాలి : భీమరాజు

### కోరుకొండలో దస్తావేజు లేఖరులు పెన్‌డౌన్




**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఓ.నెం 396ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కోరుకొండ మండలంలో దస్తావేజులేఖరులు పెన్ డౌన్ నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్లు సంఘ అధ్యక్షులు పెదపాటి భీమరాజు తెలిపారు. ఆదివారం కోరుకొండలో సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖర్లు, రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంక్షేమసంఘం పిలుపు మేరకు నేటి నుంచి జూలై 31 వరకు నిరవధిక పెన్‌డౌన్ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు పెద్దపాటి భీమరాజు తెలిపారు.ఈ సందర్భంగా పెద్దపాటి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన సేవలను, రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలకు అప్పగిస్తూ జారీ చేసిన జి.ఓ.నెం 396ను వెంటనే రద్దుచేసి,దస్తావేజు లేఖరుల జీవనోపాధి దెబ్బ తినకుండా చూడాలన్నారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు జూలై 20 నుంచి 31వ తేదీ వరకు జరిగే నిరవధిక పెన్‌డౌన్ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా దస్తావేజు లేఖరులందరూ పాల్గొంటున్నారని, రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో దస్తావేజులకు సంబంధించి అన్ని సేవలు సంభిస్తాయ న్నారు. ప్రభుత్వం జీవో నెంబర్ 396ను వెంటనే రద్దుచేసి, తమ న్యాయమైన డిమాండ్ ను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపాటి భీమరాజు, జాజుల రాజా, శ్రీపాద వెంకటేశ్వరరావు, కోట చక్రధర్, అడపా సూర్యనారాయణ మూర్తి,ఊర సుబ్రహ్మణ్యం, గంగాధర్, ఎం వీరభద్రం, జాజుల చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

# తడిగుడ్డతో గొంతులు కోయడం టీడీపీ నైజం

### స్త్రీ మూర్తిని వివస్త్రను చేయడం దారుణం -అమరావతిలో ఎయిర్‌పోర్టు అటకెక్కినట్టేనా..?

### కూటమి ప్రభుత్వం పేకమేడలా కూలడం ఖాయం.. - జగన్ 2.0 పోస్టర్ ఆవిష్కరణ : వైసిపి జాతీయ అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక సంస్థల ఎన్నికల తరువాత రాష్ట్రంలో కూటమి పార్టీల ప్రభుత్వం పేకమేడలా కుప్పకూలడం ఖాయమని, తడిగుడ్డతో గొంతులు కోయడం టీడీపీ నైజమని రాజమహేంద్రవరం మాజీ ఎంపీ, వైసిపి జాతీయ అధికార ప్రతినిధి, సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మార్గాని భరత్ రామ్ తీవ్రంగా మండిపడ్డారు. ప్రజల్ని ఏమార్చి తప్పుడు హామీలతో అధికారంలోకి తచ్చిన కూటమి ప్రభుత్వానికి బుద్ధిచెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. స్థానిక వివెల్ పురం మార్గాని ఎస్టేట్స్‌లో ఉన్న వైసిపి సిటీ కార్యాలయంలో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో మార్గాని భరత్ మాట్లాడుతూ టీడీపీ నాయకుడు ఒక స్త్రీ మూర్తిని వివస్త్రగా చేయడం దారుణమని, దీన్ని బట్టి వారి నైజం ఎంటో అర్థమవుతోందన్నారు. సిసి కెమేరాలు లేకపోతే ఈ దారుణమైన ఘటన వెలుగులోకి వచ్చేది కాదన్నారు. అబద్ధాల పునాదులపై అధికారంలోకి వచ్చిన కూటమి పార్టీకి ఇంతకంటే ఏం చేతనవుతుందని నిలదీసారు. ఈ ఘటనపై జాతీయ మహిళా కమీషన్, హ్యూమన్ రైట్స్ కమీషన్, రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం సుమోటోగా తీసుకుని విచారణ జరిపించి నిందితులకు కఠిన శిక్షలు పడేలా చేయాలని కోరారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. ఇంత అనాగరిక చర్యలకు పాల్పడుతున్న టీడీపీ నాయకులు మళ్లీ తమ వైసిపిని గొడ్డలి పార్టీ అంటున్నారని, వెన్నుపోటుతో పుట్టిన పార్టీ అదేనని ఎద్దేవా చేసారు. దేశంలో అత్యున్నత మైన సిబిఐ, ఇడి వివేకానంద రెడ్డి హత్య కేసుపై దర్యాప్తు చేస్తున్నాయన్నారు. ఈ కేసులో దస్తగిరి తరపున సిద్ధార్థ లూద్రా వాదనలు వినిపిస్తున్నారని, దీని వెనుక ఖచ్చితంగా రాజకీయ కోణం ఉందన్నారు. సిద్ధార్థ లూద్రా చంద్రబాబు పర్సనల్ లాయర్ అని డైవర్షన్ రాజకీయాలకు పాల్పడటానికే వైసిపిపై బురద జల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై లక్ష కోట్లు అంటూ ఆరోపణలు చేసారని, చివరికి అది ఏమైందో అందరికి తెలిసిందేనని వ్యాఖ్యానించారు. పదే పదే తాడేపల్లి ప్యాలెస్ అంటూ జగన్‌పై బురద జల్లుతున్నారని ఆ ఇల్లు సాధారణంగానే ఉంటుందని, హైదరాబాద్‌లో చంద్రబాబు ఉంటున్న ఇల్లు మాత్రం బకింగ్ హామ్ ప్యాలెస్‌ను తలపిస్తుందని ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ వచ్చినప్పుడు వీడియోల్లో ఆ ఇల్లు చూసామన్నారు. రాజకీయ కక్షసాధింపు చర్యలు ఆ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య అన్నారు. అమరావతిలో ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు కడతామని ఇచ్చిన హామీ ఏమైందని, ఇప్పటికే ల్యాండ్ పూలింగ్‌లో అక్కడ 50 వేల ఎకరాలు రైతుల నుంచి బలవంతంగా లాక్కున్నారని, దానిలో 2 వేల ఎకరాల్లో ఎయిర్ పోర్టు కట్టడానికి ఎందుకు వెనుకాడుతున్నారని ప్రశ్నించారు. సాక్షాస్తూ సివిల్ ఏవియేషన్ మినిస్టర్‌గా రామ్మోహన్ నాయుడు మీ పార్టీకి చెందిన వ్యక్తే ఉన్నారని, నిధులు మంజూరు చేయించుకుని ప్రధాని మోదీతో మాట్లాడి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేసారు. పవన్ కళ్యాణ్ కాపు ఎమోషన్స్ రెచ్చగొట్టి ఓట్లేయించుకున్నారని, జగన్ కంటే ఎక్కువ పథకాలు ఇస్తానని చంద్రబాబు ప్రజల్ని మోసం చేసారని ఆరోపించారు. 64 లక్షల మందికి తల్లికి వందనం ఇస్తున్నామని ప్రభుత్వం చెబుతోందని, వారి వద్ద నుంచి 2 వేల చొప్పున పాఠశాలల నిర్వహణకు వసూలు చేస్తున్నారని ఆ డబ్బు ఏమైందో చెప్పాలని డిమాండ్ చేసారు. అది కూడా స్వాహా చేసేసారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేసారు. అనంతరం జగన్ 2.0 పోస్టర్‌ను, ఈనెల 21వ తేదీన మోరంపూడి జంక్షన్‌లో చేపట్టే ఆందోళన కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్లను బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, ఇతర పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వ పాలనలో జరుగుతున్న అన్యాయాలను, అక్రమాలను ప్రశ్నిస్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తలపై అక్రమంగా, అన్యాయంగా కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. ప్రతీ ఒక్కరు ఈ యాప్ డౌన్ లోడ్ చేసుకోవాలని కోరారు. మోరంపూడి ఫ్లైఓవర్‌ను వైసిపి పాలనలో తాము నిర్మాణం చేస్తే కూటమి ప్రజా ప్రతినిధులు తాము చేశామంటే.. తాము చేశామంటూ ప్రగల్భాలు పలకడమే తప్ప రెండేళ్లయినా ఇంతవరకు సర్వీస్ రోడ్లు వేయలేకపోయారని మండిపడ్డారు. మంత్రి, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు క్రెడిట్ చోరీ చేయడానికి చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు ఫ్లైఓవర్‌కు సంబంధించిన వివరాల రికార్డులను తాను ఢిల్లీ నుంచి తెప్పించానని, అది మంగళవారం ప్రజలకు అర్థమయ్యేలా వివరిస్తామన్నారు. ఫ్లైఓవర్ సర్వీసు రోడ్లు వేయాలని డిమాండ్ చేస్తూ రిలే నిరాహార దీక్షలను ప్రారంభిస్తున్నామని, కూటమి ప్రభుత్వం మెడలు వంచి సర్వీసు రోడ్లు వేసేలా చేస్తామని స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాల బీసీ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ గౌరవ అధ్యక్షులు మార్గాని నాగేశ్వరరావు, మార్తి లక్ష్మీ, పోలు విజయలక్ష్మి సంకిస భవానీప్రియ, ముప్పన ప్రభాకర్, మార్తి నాగేశ్వరరావు, మజ్జి అప్పారావు, కాటం రజనీకాంత్ , దాసి వెంకట్రావు, బిల్డర్ చిన్న, తిరగటి దుర్గారావు, అరె చిన్ని, దూర్వాసుల సత్యనారాయణ, కొండేటి సుధ, పొదిలపు నాగు, దత్తా, కట్టా వెంకటేష్, నల్లా రామాంజనేయులు, రొక్కం త్రినాధ్, కొమ్మోజు దుర్గారావు, వట్టికూటి కృష్ణవేణి, అనురాధ, అనంతలక్ష్మి, దాడి శంకర్, కల్లి మురళి, సుందర్ సింగ్, రేగుళ్ల శ్రీధర్, గుడాల ప్రసాద్, గుడాల ఆదిలక్ష్మి, గుత్తుల భాస్కర్, సయ్యద్ హసన్, కొమ్మోజు దుర్గారావు, మార్గాని రాము తదితరులు పాల్గొన్నారు.






## అభిమానుల కోసం
# మెగాస్టార్ సంచలన నిర్ణయం

### సినిమా ఇండస్ట్రీ చరిత్రలో ఏ హీరో చేయలేని విధంగా..



మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు (ఆగస్టు 22) అంటే అభిమానులకు పండగే. అయితే ఈసారి ఆ పండగ సంతోషాన్ని మరింత రెట్టింపు చేసేలా తన మెగా అభిమానుల కోసం ఒక మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు మెగాస్టార్. ఆ వివరాలేంటో ఈ కథనంలో చూద్దాం రండి. మెగాస్టార్ చిరంజీవి క్రేజ్, పాపులారిటీ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. మూడు దశాబ్దాల పాటు తెలుగు సినీ పరిశ్రమను ఏలుతోన్న ఆయనకు కోట్లాది మంది అభిమానులు ఉన్నారు. చిరంజీవి కొత్త సినిమా రిలీజైనా ఆయన పుట్టిన రోజు వచ్చినా మెగాభిమానులకు పండగే అని చెప్పుకోవచ్చు. ఆ రోజున చిరంజీవి పేరుతో పలు సేవా కార్యక్రమాలు చేపడుతారు మెగా ఫ్యాన్స్. అన్నదానం, రక్తదానం ఇలా ఎన్నో మంచి కార్యక్రమాలు చేస్తూ మెగాభిమానులమని గర్వంగా చెప్పుకుంటున్నారు. ఒకటి.. రెండేళ్లు కాదు.. ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తోన్న తన మెగాభిమానుల కోసం చిరంజీవి ఒక కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే రానున్న ఆయన పుట్టిన రోజును పురస్కరించుకుని అభిమానులకు రూ.5 లక్షల మేర ఇన్సూరెన్స్ చేయించబోతున్నారట. ఈ విషయాన్ని అఖిల భారత చిరంజీవి యువత అధ్యక్షుడు రవణం స్వామి నాయుడు వెల్లడించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఆయన ఒక వీడియోను రిలీజ్ చేశారు. 'మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా సీనియర్ అభిమానులను అన్ని ప్రాంతాల్లో గుర్తించి సత్కరించాలి అనుకుంటున్నాం. అలాగే మూడు దశాబ్దాలుగా కష్టపడి పనిచేసిన సీనియర్ అభిమానులు, అప్పటి నుంచి ఇప్పటివరకు థియేటర్స్ దగ్గర కష్టపడినవాళ్లు, కటౌట్లు కట్టి, పూల దండలు వేసి, పాలాభిషేకాలు చేసి, సేవా కార్యక్రమాలు చేసిన వాళ్లు చాలా మంది సీనియర్ అభిమానులు ఉన్నారు. ఇప్పుడు వారందరిని గుర్తించే పనిలో ఉన్నాం. ఈ పుట్టిన రోజున చిరంజీవి సీనియర్ అభిమానులను గుర్తించి వారందరికీ కూడా 5 లక్షల ఇన్సూరెన్స్ పాలసీ అఖిల భారత చిరంజీవి సంఘం తరపున ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాం. మొదటగా గుంటూరు జిల్లా నుంచే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నాం' అని రవణం స్వామి నాయుడు చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఈ వీడియో బాగా వైరలవుతోంది. దీనిని చూసిన చిరు అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సినిమా ఇండస్ట్రీ చరిత్రంలో ఏ హీరో ఇలా అభిమానులకు ఇన్సూరెన్స్ చేయించలేదని, మెగాస్టారే ఇలాంటి మంచి కార్య క్రమానికి శ్రీకారం చుట్టారని పలువురు అభినందిస్తున్నారు. చిరంజీవి పుట్టిన రోజైన ఆగస్టు 22 నుంచే ఈ గొప్ప కార్యక్రమం మొదలుపెడతారని తెలుస్తుంది.

## కూతురు క్రేజ్ హీరోయిన్..
# 45 ఏళ్ల వయసులో బుల్లితెర బ్యూటీ గ్లామర్ సెన్సేషన్..



ప్రస్తుతం సినీరంగంలోని నటీనటులు తమ ఫిట్నెస్, లుక్స్ పై ఎంత శ్రద్ధ వహిస్తున్నారో చెప్పక్కర్లేదు. నాలుగు పదుల వయసులోనూ గ్లామర్ లుక్స్ తో కట్టిపడేస్తున్నారు. యంగ్ యాక్టర్స్ కు గట్టిపోటీ ఇస్తున్నారు. ప్రస్తుతం ఓ ముద్దుగుమ్మ దశాబ్దాలుగా సినీ ప్రపంచంలో తనదైన ముద్ర వేసింది. 45 ఏళ్ల వయసులోనూ గ్లామర్ ఫోటోషూట్లతో రచ్చ చేస్తుంది. సాధారణంగా చిత్రపరిశ్రమలో అందం, ఫిట్నెస్ అనేవి అత్యంత కీలకమైనవి అన్న సంగతి తెలిసిందే. ఈమధ్యకాలంలో తారలు తమ ఫిట్నెస్ లుక్స్ పై చాలా శ్రద్ధ తీసుకుంటున్నారు. వయసు పెరుగుతున్న కొద్దీ శరీరాకృతిని, చర్మ సౌందర్యాన్ని కాపాడుకోవడం సామాన్యులకే కాదు, సినీ తారలకు కూడా పెద్ద సవాలే అని చెప్పాలి. అయితే ఇప్పుడు సీనియర్ హీరోహీరోయిన్స్ అంత పాతికేళ్ల నటీనటులుగా కనిపిస్తూ అందరిని ఆశ్చర్యపరుస్తున్నారు. టాలీవుడ్, బాలీవుడ్, కోలీవుడ్.. ఇలా అన్ని భాషలలోనూ సెలబ్రెటీల ఫిట్నెస్ గోల్స్ గురించి తెలుసుకోవడానికి నెటిజన్స్ ఆసక్తి చూపిస్తున్నారు. కానీ, 45 ఏళ్లు దాటినా నేటికీ పాతికేళ్ల భామలకు పోటీ ఇచ్చేలా మెరిసిపోతున్న సినీ నటీమణులు ఎందరో ఉన్నారు. అలాగే బుల్లితెరపై ఆమె అత్యధిక రెమ్యునరేషన్ తీసుకుంటుంది. ఆమె పేరు శ్వేత తివారీ. శ్వేత తివారీ.. హిందీ బుల్లితెర చిత్ర పరిశ్రమలో తనదైన ముద్ర వేసింది. ఇప్పటికీ సీరియల్స్ ద్వారా ప్రేక్షకులను అలరిస్తుంది. ప్రస్తుతం ఆమె వయసు 45 సంవత్సరాలు. ఇప్పటికీ పాతికేళ్ల అమ్మాయిల అలరిస్తుంది. ఇదిలా ఉంటే.. తాజాగా ఈ అమ్మడు ఫిట్నెస్ సీక్రెట్స్ గురించి సోషల్ మీడియాలో చర్చ నడుస్తుంది. ఆమె తన ఫిట్నెస్ కోసం వర్కవుట్స్ చేయరు. ఆమె క్రమం తప్పకుండా వాకింగ్ చేస్తారు. గత రెండు నెలలుగా పిలేట్స్ అనే వ్యాయమం చేయడం ప్రారంభించినట్లు తెలిపారు. ఇది శరీరాన్ని ఫ్లెక్సిబుల్ గా ఉంచుతాయి. అలాగే యోగా చేయడం, ధ్యానం చేస్తూ తన శ్వాస పై శ్రద్ధ వహిస్తారు. అంతేకాకుండా కఠినమైన ఆహార పదార్థాలు తీసుకుంటారు. ఆమె తీసుకునే ఆహారంలో ప్రోటీన్లు, ఫైబర్, బ్రౌన్ రైస్, పప్పులు, తాజా పండ్లు ఎక్కువగా ఉంటాయట. అలాగే ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలు, బయటి జంక్ ఫుడ్, తీపి పదార్థాలకు ఆమె పూర్తిగా దూరంగా ఉంటానని చెప్పుకొచ్చారు. రోజూ తగినంత నీరు, కొబ్బరి నీళ్లు, తాజా పండ్ల రసాలు తీసుకుంటారు. షూటింగ్ సమయంలో ఎంత బిజీగా ఉన్నప్పటికీ డైట్ విషయంలో ఏమాత్రం అశ్రద్ధ వహించనని తెలిపారు. రెండుసార్లు విడాకులు తీసుకున్న శ్వేత తివారీ ఇప్పుడు ఒంటరిగానే ఉంటున్నారు. ఆమె కూతురు పాలక్ తివారీ ఇప్పుడిప్పుడే కథానాయికగా ఎంట్రీ ఇచ్చేందుకు రెడీ అవుతుంది.

# ఛాంపియన్‌ని ఎప్పుడూ తక్కువ అంచనా వేయకండి : సైనా నెహ్వాల్

జపాన్ ఓపెన్ టైటిల్ గెలిచిన పీవీ సింధుపై భారత బ్యాడ్మింటన్ దిగ్గజం సైనా నెహ్వాల్ ప్రశంసలు కురిపించారు. గాయాల నుంచి కోలుకుని అద్భుతంగా పుంజుకున్న సింధులో ఇంకా ఎన్నో టైటిళ్లు గెలిచే సత్తా ఉందన్నారు. ఛాంపియన్‌ను ఎప్పుడూ తక్కువ అంచనా వేయకూడదని, భారత్‌లో జరిగే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత ఆటగాళ్లు మెరుగైన ప్రదర్శన చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. జపాన్ ఓపెన్ సూపర్ 750 టైటిల్‌ను కైవసం చేసుకున్న భారత స్టార్ షట్లర్ పీవీ సింధుపై మాజీ ప్రపంచ నంబర్‌వన్ సైనా నెహ్వాల్ ప్రశంసల వర్షం కురిపించారు. గాయాలు, ఫామ్ సమస్యలతో గత కొన్నేళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొన్న సింధు తిరిగి అద్భుతంగా పుంజుకోవడం గొప్ప విషయమని కొనియాడిన సైనా, ఛాంపియన్‌ను ఎప్పటికీ తక్కువ అంచనా వేయకూడదు అంటూ ఆమెపై పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు. టోక్యోలో జరిగిన జపాన్ ఓపెన్ సూపర్ 750 టోర్నమెంట్ ఫైనల్లో రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు, జపాన్‌కు చెందిన మూడుసార్లు ప్రపంచ ఛాంపియన్ అకానె యమగుచిని వరుస గేమ్‌లలో ఓడించి టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. 2019 ప్రపంచ ఛాంపియన్‌షిప్ తర్వాత సింధుకు ఇదే అతిపెద్ద టైటిల్ కావడం విశేషం. ఈ విజయంతో ఆమె మళ్లీ ప్రపంచ బ్యాడ్మింటన్‌లో తన సత్తాను చాటుకున్నారు. ఈ విజయంపై స్పందించిన సైనా నెహ్వాల్ మాట్లాడుతూ.. గత రెండు మూడు సంవత్సరాలు సింధుకు ఎంతో కఠినంగా గడిచాయని, గాయాల నుంచి కోలుకుని మళ్లీ అత్యున్నత స్థాయిలో ఆడటం అంత సులభం కాదన్నారు.




అయితే జపాన్ ఓపెన్‌లో ఆమె ప్రదర్శన చూస్తే మునుపటి కంటే దాడి చేసే తీరు మరింత మెరుగైందని పేర్కొన్నారు. అగ్రశ్రేణి క్రీడాకారులను వరుసగా ఓడిస్తూ టైటిల్ సాధించడం సింధు మానసికంగా ఎంత బలంగా తిరిగి వచ్చిందో నిరూపిస్తోందన్నారు. "వయసు పెరిగే కొద్దీ గాయాలు కూడా పెరుగుతాయి. అలాంటి పరిస్థితుల్లో ఒత్తిడిని అధిగమించి నిలకడగా రాణించడం చాలా కష్టం. కానీ ఈ టైటిల్ సింధుకు తిరిగి ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. ఒకసారి ఛాంపియన్‌గా నిరూపించుకున్న ఆటగాడిని ఎప్పుడూ తక్కువ అంచనా వేయకూడదు. సరైన అవకాశం వస్తే వారు మళ్లీ అత్యున్నత స్థాయికి చేరుకుంటారు" అని సైనా వ్యాఖ్యానించారు. ఆగస్టు 17 నుంచి 23 వరకు భారత్‌లో జరగనున్న బ్యాడ్మింటన్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌పై కూడా సైనా ఆశాభావం వ్యక్తం చేశారు. 17 ఏళ్ల తర్వాత ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీకి భారత్ ఆతిథ్యం ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. ప్రస్తుతం సింధు అద్భుతమైన ఫామ్‌లో ఉండగా, లక్ష్య సేన్ కూడా మంచి ప్రదర్శన కనబరుస్తున్నాడని, స్వదేశీ అభిమానుల మద్దతుతో భారత ఆటగాళ్లు పతకాల కోసం గట్టి పోటీ ఇవ్వగలరని విశ్వాసం వ్యక్తం చేశారు. అదే సమయంలో యువ బ్యాడ్మింటన్ క్రీడాకారులు నిలకడైన ప్రదర్శన కనబరిస్తేనే భవిష్యత్తులో ప్రపంచ ఛాంపియన్లుగా ఎదగగలరని సూచించారు. బ్యాడ్మింటన్‌లో స్థిరత్వమే విజయానికి కీలకమని, యువ ఆటగాళ్లు ప్రతి టోర్నీని ఒక అవకాశంగా తీసుకోవాలని సలహా ఇచ్చారు. కామన్వెల్త్ గేమ్స్‌లో ఈసారి బ్యాడ్మింటన్, హాకీ, షూటింగ్ వంటి క్రీడలు లేకపోవడం బాధ కలిగించిందని సైనా పేర్కొన్నారు. అయినప్పటికీ భారత బృందం అత్యుత్తమ ప్రదర్శన చేసి ఎక్కువ పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో కోచింగ్ బాధ్యతలు చేపట్టే విషయంపై ఇప్పుడే నిర్ణయం తీసుకోనని, ప్రస్తుతం యువ ఆటగాళ్లను ప్రోత్సహించడంపైనే దృష్టి సారిస్తున్నానని ఆమె స్పష్టం చేశారు.

# అర్జెంటీనాను చిత్తు చేసి ఫిఫా వరల్డ్ కప్ 2026 విజేతగా నిలిచిన స్పెయిన్

ఫిఫా వరల్డ్ కప్ 2026 ఫైనల్లో అర్జెంటీనాపై 1-0తో విజయం సాధించిన స్పెయిన్ 16 ఏళ్ల తర్వాత ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచింది. మెస్సీ కల చెదిరిపోగా, ఎంబాప్పే గోల్డెన్ బూట్ దక్కించుకున్నాడు. ఫెర్రాన్ తోర్రెస్ గోల్‌తో స్పెయిన్ చరిత్ర సృష్టించింది. ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది క్రీడాభిమానులు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూసిన ఫిఫా ప్రపంచకప్ 2026 గ్రాండ్ ఫైనల్ మ్యాచ్ అత్యంత రసవత్తరంగా ముగిసింది. డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా, స్పెయిన్ జట్ల మధ్య జరిగిన ఈ హై-వోల్టేజ్ ఫైట్‌లో స్పెయిన్ 1-0 గోల్ తేడాతో సంచలన విజయం సాధించింది. దాదాపు 16 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత స్పెయిన్ ఫుట్‌బాల్ జట్టు మళ్లీ ప్రపంచ ఛాంపియన్‌గా అవతరించి ట్రోఫీని కైవసం చేసుకుంది. మ్యాచ్ ఆరంభం నుంచి ముగిసే వరకు స్పెయిన్ ఆటగాళ్లు పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ అర్జెంటీనాను గట్టి ఒత్తిడిలోకి నెట్టారు.నిర్ణీత 90 నిమిషాల ఆట ముగిసే సమయానికి ఇరు జట్లు ఒక్క గోల్ కూడా చేయకపోవడంతో మ్యాచ్ ఎక్స్‌ట్రా టైమ్‌కు దారితీసింది. అయితే 106వ నిమిషంలో స్పెయిన్ స్టార్ ఫార్వర్డ్ ఫెర్రాన్ తోర్రెస్




అద్భుతమైన నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. అర్జెంటీనా డిఫెన్స్ ను చీల్చుకుంటూ వెళ్లి ఆయన వేసిన పవర్ ఫుల్ షాట్ నేరుగా గోల్ పోస్ట్‌లోకి దూసుకెళ్లింది. ఈ ఒక్క గోల్ స్పెయిన్‌కు చారిత్రాత్మక విజయాన్ని అందించగా, మ్యాచ్‌ను సమం చేసేందుకు అర్జెంటీనా చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదు. ఈ మ్యాచ్‌లో అర్జెంటీనా జట్టుకు మొదటి నుంచి అదృష్టం కలిసిరాలేదు. మ్యాచ్ మధ్యలో అర్జెంటీనా కీలక ఆటగాడు ఎంజో ఫెర్నాండెజ్‌కు రెఫరీ రెడ్ కార్డ్ చూపించి మైదానం నుంచి బయటకు పంపించివేశాడు. దీంతో అర్జెంటీనా కేవలం 10 మంది ఆటగాళ్లతోనే మ్యాచ్‌ను కొనసాగించాల్సి వచ్చింది. మైదానంలో స్పెయిన్ ఆటగాళ్లు ఏకంగా 20 సార్లు గోల్ పోస్ట్‌ను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయగా, అర్జెంటీనా మాత్రం కేవలం 2 సార్లు మాత్రమే అలాంటి ప్రయత్నం చేయగలిగింది. అర్జెంటీనా గోల్‌కీపర్ మార్టినెజ్ అద్భుతమైన సేవ్‌లతో మొదటి 90 నిమిషాలు జట్టును కాపాడినప్పటికీ, ఎక్స్‌ట్రా టైమ్‌లో స్పెయిన్ ధాటికి లొంగక తప్పలేదు. దిగ్గజ ఆటగాడు లియోనెల్ మెస్సీకి ఈ ఫైనల్ మ్యాచ్ తీవ్ర నిరాశను మిగిల్చింది. ఈ టోర్నమెంట్‌లో అంతకుముందు వరకు 8 గోల్స్ చేసి అద్భుత ఫామ్‌లో ఉన్న మెస్సీ, ఫైనల్లో మాత్రం స్పెయిన్ డిఫెండర్ల వ్యూహాల వల్ల స్పష్టమైన ప్రభావం చూపలేకపోయాడు. దీంతో ఆయన ప్రపంచకప్‌ను నిలబెట్టుకోవడంలోనే కాకుండా గోల్డెన్ బూట్ అవార్డును కూడా కోల్పోయాడు. మొత్తం టోర్నీలో 10 గోల్స్ సాధించిన ఫ్రాన్స్ సంచలనం కిలియన్ ఎంబాప్పే అత్యధిక గోల్స్ చేసిన వీరుడిగా నిలిచి గోల్డెన్ బూట్ అవార్డును ముద్దాడాడు. ఈ మ్యాచ్‌లో అర్జెంటీనా గెలిచి ఉంటే ప్రపంచ ఫుట్‌బాల్ చరిత్రలోనే ఒకే ఒక్క అరుదైన రికార్డును సాధించి ఉండేది. ఇప్పటివరకు ఫుట్‌బాల్ చరిత్రలో కేవలం ఇటలీ (1934, 1938), బ్రెజిల్ (1958, 1962) జట్లు మాత్రమే వరుసగా రెండుసార్లు ప్రపంచకప్ టైటిల్స్ గెలుచుకున్నాయి. 2022 ఫైనల్లో ఫ్రాన్స్‌ను పెనాల్టీ షూటౌట్‌లో ఓడించిన అర్జెంటీనా, 2026 లో స్పెయిన్ చేతిలో భంగపాటుకు గురవ్వడంతో ఇటలీ, బ్రెజిల్ సరసన నిలిచే ఆ సువర్ణ అవకాశాన్ని చేజార్చుకుంది.

విశ్వం వాయిస్ తెలుగు దినపత్రికలో వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com